మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 17 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# రాయబరేలిపై బిజెపి వ్యూహాత్మక అడుగులు

### నూపుర్ శర్మన్ బరిలో దింపుతారని ప్రచారం

### రాయబరేలీ కాంగ్రెస్ అభ్యర్థిపై అనిశ్చిత

### అమేథీలో మరోమారు పోటీ చేస్తున్న స్మృతి ఇరానీ



న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు): యూపిలోని రాయబరేలిపై ఇజెపి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గతంలో సోనియా ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా నుపుర్ శర్మకు ఈ స్థానంలో బీజేపీ టిక్కెట్టు ఇచ్చే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై నుపుర్ శర్మ గత ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నుపుర్ 31 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఓ టీవీ ఛానెల్‌లో జరిగిన డిబేట్ లో మహమ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇది పెను దుమారం రేపింది. తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో ఆమెను బీజేపీ పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ విషయం అంతర్జాతీయ స్థాయిలోనూ చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల నడుమ రాయ్‌బరేలీ నుంచి నుపుర్‌కు బీజేపీ టిక్కెట్ ఇస్తుందనే ఊహాగానాలు హాట్ టాపిక్ గా మారాయి. గాంధీ కుటుంబానికి కంచు కోటగా భావిస్తున్న రాయ్ బరేలీలో కాంగ్రెస్ తరఫున బలమైన అభ్యర్థులు లేకపోవడంతో బీజేపీ అభ్యర్థి నుపుర్ శర్మ సునాయాసంగా విజయం సాధిస్తారనే అంచనాలు మొదలయ్యాయి. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని గతంలో వార్తలు వచ్చాయి. అయితే దీనిపై ఎలాంటి అధికార ప్రకటన విడుదల కాలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 400 కంటే ఎక్కువ సీట్లు గెలవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇందుకోసం బీజేపీ, మిత్రపక్షాలు ఒక్కో సీటుపై ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నాయి. జనాభా పరంగా దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా నిలిచిన ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. 2019లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి సోనియా గాంధీ విజయం సాధించారు. 2004 నుంచి వరసగా ఎన్నికల్లో గెలుస్తున్నారు. కానీ ఈ ఏడాది లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. అయితే ఈ ఎన్నికలకు ముందే ఆమె రాజ్యసభకు వెళ్లారు. దీంతో బరేలీ భవితవ్యంపై దేశవ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయి. ఇన్నాళ్లూ ఉత్తరప్రదేశ్‌లో రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాలు గాంధీ-నెహ్రూ కుటుంబానికి కంచుకోటలుగా ఉండేవి. మిగతా 2లో..

# తెలంగాణ ఎంపి సీట్లపై సిడబ్ల్యూసి చర్చ



### ఒకటి రెండు రోజుల్లో సీట్ల ప్రకటన

న్యూఢిల్లీ,మార్చి19(ప్రజా మంటలు): ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మంగళవారం నాడు సమావేశం మిగతా 2లో..

# గవర్నర్‌గా రాధాకృష్ణన్ నేడు బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): తమిళిసై సౌందరరాజన్ రాజీనామా చేయడంతో తెలంగాణకు కొత్త గవర్నర్‌గా ఝార్ఖండ్ గవర్నర్ (సీపీ రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్తగా నియమితులైన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌కు రానున్నారు. రాత్రి 8.20 గంటలకు రాంచీలోని రాజ్ భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 8.40కి స్థానిక బిర్సా ముండా ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. రాత్రి 9.10కి రాంచీ ఎయిర్ పోర్టు నుంచి విమానంలో హైదరాబాద్ కు పయనం అవుతారు. రాత్రి 10.55 గంటలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 11.35 గంటలకు హైదరాబాద్ లోని రాజ్ భవన్ కు చేరుకోనున్నారు. బుధవారం ఉదయం 11:15 నిలకు తెలంగాణ గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్మం ఆమోదించారు. అనంతరం తెలంగాణ కొత్త గవర్నర్‌గా ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తెలంగాణకు పూర్తి స్థాయి గవర్నర్‌గా నియమించే వరకు తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ కొనసాగనున్నారు. మిగతా 2లో..

# తెలంగాణ హైకోర్టుకు మరో ఇద్దరు జడ్జిలు

### కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ



న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా ఇద్దరు న్యాయమూర్తుల నియామకం జరిగింది. మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య తెలంగాణ ఉన్నత న్యాయస్థానానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్‌ను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం గత నెలలో జస్టిస్ మౌసమీ భట్టాచార్య బదిలీకి సంబంధించి కేంద్రానికి సిఫారసు చేసింది. ఇక మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్ తనను బదిలీ చేయాలని కొలీజియానికి మిగతా 2లో..



# ఉపరితల ద్రోణి ప్రభావం

### ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మేఘావృతం

### పలుచోట్ల అకాల వర్షాలకు అవకాశం

హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఒకటి కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ద్రోణిదక్షిణ తమిళనాడు నుంచి అంతర్గత కర్ణాటక మీదుగా పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాలలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం వరకు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతుందని తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో మిగతా 2లో..

# అకాల వర్షంతో రైతులకు నష్టం

### వెంటనే ఆదుకోవాలన్న హరీష్ రావు



హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసిందన్నారు. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చిందని చెప్పారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్న ప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే మిగతా 2లో..

# కెసిఆర్ సారథ్యంలోనే పనిచేస్తాం

### పార్టీ మారపు ప్రచారంపై మండిపడ్డ ఎర్రబెల్లి

### ఆకురాలే కాలమన్న మాజీ ఎమ్మెల్యే వినయ్



వరంగల్,మార్చి19 (ప్రజా మంటలు): కేసీఆర్ సారథ్యంలో పార్టీ కోసం ఒక సైనికుడిగా పని చేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగు తున్నట్లుగా దుష్ప్రచారం జరుగుతోం దని కొట్టిపారేశారు. తనకు మిగతా 2లో..


# మా అమ్మను కలిసేందుకు అనుమతించండి

### ఢిల్లీ కోర్టులో కవిత పిటిషన్



న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో మా అమ్మను కలిసేందుకు అనుమతించండి అంటూ న్యాయస్థానాన్ని కవిత అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవిత అభ్యర్థనకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య.. సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత.. సోదరుడు ప్రశాంత్ రెడ్డిలను కలుసుకునేందుకు న్యాయస్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమంలో తల్లీ, కుమారులు, కుటుంబసభ్యులను కలిసేందుకు కవితను న్యాయస్థానం అనుమతించింది. మిగతా 2లో..

## ప్రజా నాడి




# అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా

### పిఠాపురంలో లక్ష మెజార్టీతో గెలుస్తా

### జనసేన కార్యాలయంలో పవన్ కళ్యాణ్

### కాకినాడ ఎంపి అభ్యర్థిగా టీటైమ్ ఓనర్ శ్రీనివాస్ ఎంపిక



మంగళగిరి,మార్చి19 (ప్రజా మంటలు): పిఠాపురంలో లక్ష మెజార్టీతో గెలుస్తానని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. లక్షలు కుమ్మరించి గెలవాలని చూస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.. పిఠాపురంలో కులాల ఐక్యత మొదలైందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు.. పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నా గెలుపు కోసం మాత్రమే పిఠాపురం నుంచి పోటీ చేయట్లేదు. గాజువాక, భీమవరంతో పాటు పిఠాపురం కూడా నాకు ముఖ్యమే. ఇక్కడి నుంచే పోటీ చేయాలని ఎక్కువగా విజ్ఞప్తులు వచ్చాయి. నన్ను అసెంబ్లీకి పంపిస్తామనే హామీ చాలా మంది ఇచ్చారు. ఇకపై పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకుంటా. ఇక్కడి నుంచే రాష్ట్ర భవిష్యత్తు మార్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. పిఠాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గం చేద్దాం. ఒక ఎమ్మెల్యే తలచుకుంటే ఎంత అభివృద్ధి చేయొచ్చో అంత చేసి చూపిస్తా. నియోజకవర్గంలో విద్యా, వైద్య, ఉపాధి అవకాశాలు పెంచుతాం. పిఠాపురంలో రైతును కన్నీరు పెట్టనివ్వను. కేంద్ర నాయకత్వం నన్ను ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయమని అడిగింది. కానీ, ఎమ్మెల్యేగా పోటి చేయడమే నాకిష్టం. తొలుత రాష్ట్రం కోసం పనిచేసి తర్వాత దేశం కోసం చేద్దాం. 2009లో పిఠాపురం నుంచి ప్రజారాజ్యం తరఫున వంగా గీత గెలిచారు. ఆమె వైకాపాను వీడి జనసేనలోకి రావాలి. రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి నన్ను ఓడించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.. పిఠాపురంలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తా. వ్యవస్థపై కోపంతో ఎవరూ నోటాకు ఓటు వేయొద్దు' అని విజ్ఞప్తి చేశారు. తాను అందర్నీ కలుపుకుని వెళ్లే రకం మిగతా 2లో..

# రిజర్వాయర్లలో సరిపడా నీటినిల్వలు

### తాగునీటికి ఢోకా లేకుండా చర్యలు

### అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేపట్టాలి

### అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి

### పకడ్బందీగా పది పరీక్షల నిర్వహణకు సూచనలు



హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్నందున ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి అవసరాలకు ఏవిధమైన ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి

# రాయబరేలిపై బిజెపి వ్యూహాత్మక అడుగులు

మొదటి పేజీ తరువాయి

కానీ 2019 లోక్‌సభ ఎన్నికల సమయం నుంచి పరిస్థితి మారింది. కంచుకోటకు బీటలువారాయి. ఆ ఎన్నికల్లో అమేథీలో రాహుల్ గాంధీ ఓటమి పాలవగా, సోనియా గాంధీ అతికష్టం మీద రాయ్‌బరేలీ నుంచి గట్టెక్కారు. అయితే అదృష్టావశాత్తూ రాహుల్ గాంధీ కేరళలోని వాయనాడ్ నుంచి కూడా పోటీ చేయడంతో అక్కడ గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టగలిగారు. ఇప్పుడు ఆయన కేరళను తన రాజకీయ స్థావరంగా మార్చుకున్నారు. రాయ్‌బరేలీ స్థానం నుంచి లోక్‌సభ ఎంపీగా పనిచేసిన సోనియా గాంధీ ఈసారి ప్రత్యక్ష ఎన్నికలకు దూరమై రాజ్యసభ సభ్యురాలుగా మారారు. అటువంటి పరిస్థితిలో ప్రియాంక గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని, అలాగే రాహుల్ గాంధీ తన పాత సీటు అమేథీ నుండి కూడా బరిలోకి దిగుతారని ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఇద్దరూ యూపీ నుంచి పోటీ చేయడానికి నిరాకరించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తమ సాంప్రదాయ స్థానాల నుండి గాంధీ కుటుంబంలోని సభ్యులెవరూ రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని స్పష్టమైంది. రాహుల్ గాంధీ కేరళలోని వాయనాడ్ నుంచి మాత్రమే పోటీ చేస్తున్నారు. పార్టీ ప్రకటించిన తొలి జాబితాలోనే

ఆయన పేరు వాయనాడ్ నుంచి పేర్కొన్నారు. గాంధీ కుటుంబానికి దూరమైన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి అమేథీ, రాయ్ బరేలీ స్థానాలపై పడింది. అక్కణ్ణుంచి ఎవరు పోటీ చేస్తారు? కాంగ్రెస్ ఎవరిని నిలబెడుతుంది? అన్నది ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. నెహ్రూ-గాంధీ కుటుంబానికి అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలతో భావోద్వేగ సంబంధం ఉంది. రాయ్‌బరేలీతో నెహ్రూ-గాంధీ కుటుంబానికి నాలుగు తరాల బంధం ఉండగా.. అమేథీ సీటుతో గాంధీ కుటుంబానికి ఉన్న అనుబంధం 1977లో సంజయ్ గాంధీ ఎన్నికలలో పోటీ చేసిన నాటిది. ఫిరోజ్ గాంధీ రాయ్ బరేలీ నుండి ఎన్నికలలో పోటీ చేయడం ద్వారా ఎంపీ అయ్యారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ దానిని తన కార్యక్షేత్రంగా చేసుకున్నారు. మొదట సంజయ్ గాంధీ, ఆ తర్వాత రాజీవ్ గాంధీ అమేథీ నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. తాజాగా సోనియా గాంధీ, రాహుల్ అమేథీని తమ కార్యక్షేత్రంగా చేసుకున్నారు. అయితే అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ గాంధీ ఓడిపోయి ఐదేళ్లవుతోంది. కానీ ఆ ఓటమి మిగిల్చిన గాయం నుంచి అటు కాంగ్రెస్, ఇటు గాంధీ కుటుంబం ఇంకా కోలుకోలేదు. దీంతో అమేథీతో గాంధీ కుటుంబానికి ఉన్న అనుబంధం, భావోద్వేగ సంబంధం మునుపటిలా లేదు. అందుకే రాహుల్ గాంధీ ఇప్పుడు వయనాడ్ స్థానం నుంచి మాత్రమే పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. స్వాతంత్య్రం తరువాత, ఫిరోజ్ గాంధీ రాయ్‌బరేలీ నుండి మొదటి ఎంపీ. దీని తర్వాత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాయ్‌బరేలీని తన కార్యక్షేత్రంగా చేసుకుని 1967 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ తర్వాత 1971 ఎన్నికల్లో కూడా ఇందిరా గాంధీ ఇక్కడ నుండి గెలిచారు. కానీ 1977లో ఆమె జనతా పార్టీకి చెందిన రాజనారాయణ చేతిలో ఓడిపోయారు. 1980 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరా గాంధీ రాయ్‌బరేలీతో పాటు నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని మెదక్ నుంచి కూడా పోటీ చేసి రెండు స్థానాల్లో విజయం సాధించారు. అయితే ఆమె రాయ్‌బరేలీ స్థానానికి రాజీనామా చేసి మెదక్ స్థానం నుంచి ఎంపీగా కొనసాగారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ఎన్నడూ రాయ్ బరేలీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేయలేదు. అంతేకాదు, గాంధీ కుటుంబంలోని ఏ సభ్యుడు కూడా రాయ్‌బరేలీ స్థానం నుండి సుమారు 43 సంవత్సరాలుగా ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ కుటుంబానికి కానీ దూరపు బంధువులకు మాత్రమే టిక్కెట్ ఇచ్చింది. ఇప్పుడు రాహుల్ గాంధీ అమేథీలో ఓటమి తర్వాత ఇందిర నడిచిన బాటలోనే నడవాలని భావిస్తున్నారు. ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని వదిలిపెట్టిన తర్వాత, అరుణ్ నెహ్రూ కాంగ్రెస్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి ఎంపీ అయ్యారు. అరుణ్ నెహ్రూ మోతీ లాల్ నెహ్రూ బంధువు భాయ్ శ్యామ్ లాల్ నెహ్రూ మనవడు. ఇదీ గాంధీ కుటుంబానికి ఉన్న అనుబంధం. రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు అరుణ్ నెహ్రూ ఆయనకు సలహాదారుగా ఉన్నారు. కానీ తరువాత కాంగ్రెస్‌ను వీడి వీపీ సింగ్‌తో పాటు చేరారు. అరుణ్ నెహ్రూ 1981, 1984లో రాయ్‌బరేలీ నుంచి ఎంపీ అయ్యారు. ఆయన జనతాదళ్‌లో చేరినప్పుడు కాంగ్రెస్ షీలా కౌల్‌కు టికెట్ ఇచ్చింది. షీలా కౌల్ ఇందిరా గాంధీ మామ భార్య. షీలా కౌల్ 1989, 1991లో రాయ్‌బరేలీ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. షీలా కౌల్ తర్వాత, కాంగ్రెస్ 1996లో రాయ్‌బరేలీ నుంచి ఆమె కుమారుడు విక్రమ్ కౌల్‌ను అభ్యర్థిగా చేసింది, కానీ అతను గెలవలేకపోయాడు. దీని తర్వాత 1998లో కాంగ్రెస్ షీలా కౌల్ కుమార్తె దీపా కౌల్‌ను రాయ్‌బరేలీ నుండి అభ్యర్థిగా చేసింది, కానీ ఆమె కూడా గెలవలేకపోయింది. 1999లో కాంగ్రెస్ టిక్కెట్‌పై రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా గెలిచిన కెప్టెన్ సతీష్ శర్మకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది. కెప్టెన్ శర్మ గాంధీ కుటుంబానికి చెందినవాడు కాదు. కాకపోతే రాజీవ్ గాంధీకి స్నేహితుడు. తనను రాజకీయాల్లోకి రాజీవ్ గాంధీయే తీసుకొచ్చారు. 1991లో రాజీవ్ గాంధీ హత్య తర్వాత అమేథీ లోక్‌సభ స్థానం నుంచి కెప్టెన్

సతీష్ శర్మకు కాంగ్రెస్ టికెట్ లభించింది. ఆ సమయంలో సోనియా గాంధీ రాజకీయాల్లోకి రావడానికి నిరాకరించారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ కెప్టెన్ శర్మను అమేథీ నుండి అభ్యర్థిగా చేసింది. కెప్టెన్ శర్మ 1991, 1996లో అమేథీ నుంచి గెలిచి ఎంపీగా ఉండి కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1998లో కూడా కెప్టెన్ శర్మ అమేథీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసినా గెలవలేకపోయారు. రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎనిమిదేళ్ల పాటు గాంధీ కుటుంబంలో ఎవరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఇందిరా గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని వదిలిపెట్టినప్పుడు, ఆమె తన స్థానంలో రాయ్‌బరేలీ నుంచి బయటి వ్యక్తులను నిలబెట్టకుండా తన బంధువులపై మాత్రమే నమ్మకం పెట్టుకున్నారు. 1999లో సోనియా గాంధీ రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు అమేథీ ప్రాంతాన్ని తన కార్యక్షేత్రంగా మార్చుకున్నారు. కెప్టెన్ సతీష్ శర్మ అమేథీ స్థానాన్ని వదిలిపెట్టి, రాయ్‌బరేలీని ఎంచుకున్నారు. సోనియా అమేథీ నుంచి ఎంపీగా, కెప్టెన్ శర్మ రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు, సోనియా గాంధీ అమేథీ సీటును రాహుల్ కోసం వదిలిపెట్టి, తాను స్వయంగా రాయ్ బరేలీకి మారారు. రాహుల్ గాంధీ అమేథీ నుంచి వరుసగా మూడు ఎన్నికల్లో విజయం సాధించగా, సోనియా గాంధీ రాయ్ బరేలీ నుంచి వరుసగా నాలుగు ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో రాహుల్ అమేథీ నుంచి ఓడిపోయినా, సోనియా రాయ్‌బరేలీ నుంచి విజయం సాధించి ఎంపీగా కొనసాగారు. ఈ రెండు స్థానాలను గాంధీ-నెహ్రూ కుటుంబం వదులుకున్న ప్రతి సందర్భంలోనూ సమీప లేదా దూరపు బంధువులను బరిలోకి దింపిన ఆనవాయితీని ఈసారి కొనసాగిస్తారా లేక కొత్త సంస్కృతికి తెరలేపుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. 2024లో అమేథీ, రాయ్‌బరేలీ నుంచి గాంధీ కుటుంబంలో ఎవరూ పోటీ చేయడం లేదని స్పష్టమైంది. ఈ పరిస్థితుల్లో రాయ్‌బరేలీ, అమేథీ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకునే ఆ నేతలు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. సమాజ్‌వాదీతో సీట్ల పంపకంలో కాంగ్రెస్ ఈ రెండు స్థానాలను తమ ఖాతాలోకే తీసుకుంది. ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయకపోతే గాంధీ కుటుంబానికి సన్నిహితంగా ఉండే నాయకురాలికి మాత్రమే టికెట్ ఇస్తారని తెలుస్తోంది. రాయ్‌బరేలీ నుంచి సోనియా గాంధీ ఎంపీగా ఉన్నప్పుడు ఆమె తరఫున నియోజకవర్గంలో ప్రతినిధిగా పనిచేసిన కిషోరి లాల్ శర్మకు టికెట్ ఇవ్వవచ్చని తెలుస్తోంది. కెఎల్ శర్మ ఎన్నికల సన్నాహాల్లో ఇప్పటికే బిజీగా ఉన్నారు. గత 20 సంవత్సరాలుగా రాయ్‌బరేలీలో సోనియా గాంధీ పనులన్నీ ఆయనే చూస్తున్నారు కాబట్టి ఓటర్లతోనూ సత్సంబంధాలున్నాయి. అమేథీలో కూడా గాంధీ కుటుంబానికి సన్నిహితంగా ఉండే నాయకుడికే టికెట్ దక్కనుంది. ఈ జాబితాలో చాలా మంది పేర్లు వినిపిస్తున్నాయి. చివరకు అవకాశం దక్కించుకునే ఆ వ్యక్తి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఢీకొట్టగలరా అన్నది వేచిచూడాలి

## గవర్నర్‌గా రాధాకృష్ణన్ నేడు బాధ్యతల స్వీకరణ

**జార్ఖండ్ గవర్నర్‌కు అదనంగా తెలంగాణ బాధ్యతలు**

తెలంగాణ కొత్త గవర్నర్‌గా ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. దీంతో గవర్నర్ పోస్ట్ ఖాళీ అయ్యింది. అ క్రమంలో తాత్కాలిక గవర్నర్‌గా ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తెలంగాణకు పూర్తి స్థాయి గవర్నర్‌గా నియమించే వరకు తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ కొనసాగనున్నారు.

## అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా



మనిషినని, తప్పుదు అనుకుంటే తప్పా తాను గొడవకు వెళ్లనని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురాన్ని ఎవరైనా భయపెడతా అంటే.. వారికి వ్యతిరేకంగా తాను అడ్డుగోడగా నిలబడతానని చెప్పారు. తనను కట్టడి చేసే బాధ్యత మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డి తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో కలిసిన సందర్భంగా ఎన్ని కష్టాలు ఎదురైనా తమ నియోజకవర్గాన్ని కాపాడుకుంటామని చెప్పినట్లు తెలిపారు. కూటమి నుంచి జనసేనకు 2 ఎంపీ సీట్లు వచ్చాయి. అందులో భాగంగా కాకినాడ ఎంపీ నియోజకవర్గానికి జనసేన అభ్యర్థిని మంగళవారం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా 'టీ టైమ్' ఓనర్ ఉదయ్ శ్రీనివాస్ తంగెళ్ల పేరును పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఉదయ్ ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గం ఇంఛార్జ్‌గా ఉన్నారు. ఆ స్థానంలో పవన్ బరిలోకి దిగడంతో ఉదయ్ శ్రీనివాస్ కు కాకినాడ ఎంపీ సీటు ఖరారు చేశారు. ఉదయ్ తనకు తమ్ముడి లాంటి వాడని, తన విజయం కోసం కూటమి శ్రేణులు సహకారం అందించాలని పవన్ కోరారు. ఎంపీ అభ్యర్థిగా ఉదయ్ పేరు ప్రకటిస్తూ.. భవిష్యత్తులో తనకు ఎసరు పెట్టవు కదా అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఉదయ్ తన కోసం ఎంతో త్యాగం చేశాడని, భారీ మెజార్టీతో అతడ్ని గెలిపించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వంగా గీత, సునీల్ మన ద్వారా రాజకీయాల్లోకి వచ్చారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ కార్యక్రమంలో కనిపించిన సునీల్.. తన డ్రెస్ బాగాలేదన్నారని పవన్ తెలిపారు. ఆయన ఓ మంచి వ్యక్తి కానీ.. సరిగ్గా లేని ఓ పార్టీలో ఉన్నారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాళహస్తిలో జనసేన చెందిన వారిపై దెబ్బ పడితే.. ఢిల్లీ పర్యటన రద్దు చేసుకుని వారికి మద్దతుగా అక్కడికి వెళ్లానని పేర్కొన్నారు. పార్టీ శ్రేణుల్ని తాను కాపాడుకుంటానని, ఒకదెబ్బ పడితే ఊరుకునేది లేదన్నారు. 'కాకినాడ పెన్షనర్ల స్వర్గం అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మా పెదనాన్న అక్కడ పోస్ట్ మాస్టర్ గా చేశారని, తన బంధువులు చాలా మంది కోనసీమలో ఉన్నారు. అలాంటి ప్రాంతం ప్యారడైజ్ ఫర్ గంజాయిగా మారింది. క్రైమ్ రేట్ పెరుగుతోంది. వీటిని అరికట్టాలంటే బలమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు ప్రజా ప్రతినిధులుగా ఉండాలి. అందుకే పిఠాపురం నుంచి తాను, కాకినాడ నుంచి ఉదయ్ ని గెలిపించండి. ఉదయ్ అన్ని నియోజకవర్గాలు తిరగాలి. మరో తరం కోసం తాము పనిచేయాలని, ఇప్పుడు పుట్టబోయే బిడ్డలకు 2047లో మెరుగైన అభివృద్ధి చెందిన సమాజం కావాలన్నది ప్రధాని మోదీ ఆకాంక్ష. మోదీ, అమిత్ షా భవిష్యత్తులో తనను ఎంపీగా పోటీ చేయాలని అడిగితే.. ఉదయ్ ని అడిగి తాను ఎంపీగా, ఎమ్మెల్యేగా ఉదయ్ సీట్లు మార్పిడి చేసుకుంటామని చెప్పాను. అందరి కోసం 4 దశాబ్దాలుగా ఉన్న టీడీపీ, కేంద్రంలో బలమైన బీజేపీ, జనసేన ఓ కూటమిగా ఏర్పడ్డాం. 5 కోట్ల ఏపీ ప్రజల ఆకాంక్ష నెరవేర్చుకుందాం. ఈ రెండు సీట్లతో పాటు జనసేనకు వచ్చిన అన్ని స్థానాల్లో గెలిచి చూపిద్దాం' అని పవన్ పిలుపునిచ్చారు. స్తాద్ భగత్ సింగ్ సినిమాలో ఓ సీన్ గురించి పవన్ కళ్యాణ్ వివరించారు. 'గాజు గ్లాస్ పగిలే సీన్ ఎందుకు అని హరీష్ శంకర్ ను అడిగితే.. మిమ్మల్ని చాలా మంది ట్రోల్ చేస్తారు కానీ వారికి విషయం తెలియాలి. గాజు గ్లాస్ ఎంత పగిలితే అంత పదునెక్కుతుందని హరీష్ శంకర్ డైలాగ్ పెట్టారని చెప్పారు. దశాబ్దం అధికారం లేకున్నా పార్టీ నడపడం అంత ఈజీ కాదు. జనసేన సీట్లు గెలిపిస్తే యావత్ భారతదేశాన్ని ఏపీ వైపు చూసేలా చేస్తాం. జాతీయ స్థాయి నాయకులను ఒప్పించి పొత్తు వచ్చేలా చూశా. ఎవరినో తొక్కడానికి రాజకీయాలు చేయడం లేదు, కేవలం నిలదొక్కుకోవడానికి మాత్రమే. పిఠాపురంలో మొదలుపెడదాం, అన్నీ గెలుస్తూ వెళదాం. ఏర్పాటు కానున్న ఎన్డీఏ ప్రభుత్వంలో మన వంతు పదవులు దక్కించుకుందాం. కష్టపడే వారికి ఫలితం దక్కాలి. లక్ష మెజార్టీతో గెలిపించాలని' పవన్ కళ్యాణ్ కోరారు.

## మా అమ్మను కలిసేందుకు అనుమతించండి



అయితే.. ఈడీ కస్టడీకి అనుమతించిన శనివారం రోజు భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావు, కజిన్ బ్రదర్స్ పి శ్రీధర్, ప్రణీత్ కుమార్, పీఏ శరత్ చంద్రలను కలుసుకునేందుకు కోర్టు అంగీకరించిన విషయం తెలిసిందే. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకునేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మందిని కలవడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని ఈరోజు కవిత తాజా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ముందుగా అనుమతించిన వారిలో కేటీఆర్ పేరుతో పాటు తల్లి, కుమారులు, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డి కలిసేందుకు అనుమతించాలని కవిత తరపు న్యాయవాదులు తెలిపారు. దీంతో ఆ మేరకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కవిత సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు ఈడీ తరపు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, ఈడీపై తగిన చర్యలు తీసుకోవాలని కవిత తరఫున న్యాయవాది ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు.

## ఉపరితల ద్రోణి ప్రభావం

తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడ అక్కడ ఎల్లుండి కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులు, వడగళ్ళతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు, ఎల్లుండి ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు అక్కడ అక్కడ కురిసే అవకాశం ఉంది. 19న తెలంగాణలోని నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్లవాన పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంది. నగరంలో తేలికపాటి చినుకులు కురిసే అవకాశం ఉంది. ఉదయం వేళల్లో పొగమంచు పరిస్థితులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 35 డిగ్రీలు, 23 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయ దిశగా ఉండే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలుగా నమోదైంది. 71 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సగటు సముద్ర మట్టానికి సగటున 0.9 కిలో మీటర్ల ఎత్తులో ద్రోణి వ్యాపించి ఉందని తెలిపారు. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రలో వాతావరణం పొడిగానే ఉంటుందని అమరావతి వాతావరణ అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాయలసీమలో ఎక్కువగా వాతావరణం పొడిగా ఉంటుందని చెప్పారు. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

## తెలంగాణ ఎంపి సీట్లపై సిడబ్ల్యూసి చర్చ

అయింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర సభ్యులు హాజరయ్యారు. సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో కర్ణాటక, తెలంగాణ , గుజరాత్, మధ్యప్రదేశ్, చండీఘడ్, సిక్కిం , వెస్ట్ బెంగాల్, అండమాన్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల లోక్ సభ అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ నుంచి టీపీసీసీ ప్రెసిడెంట్, సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఇప్పటి వరకు రెండు జాబితాల్లో 82 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాల్లో 4 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. 13 పార్లమెంట్ స్థానాలపై నేడు(మంగళవారం) సమావేశంలో చర్చించనున్నారు. సీఈసీ సమావేశంలో తెలంగాణలో దాదాపు 7 నుంచి 9 ఎంపీ స్థానాలపై ఏకాభిప్రాయం వచ్చే అవకాశం ఉంది. రెండ్రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

## అకాల వర్షంతో రైతులకు నష్టం

### వెంటనే ఆదుకోవాలన్న హరీష్ రావు

ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసింది. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతోపాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే, అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ గారు స్వయంగా వెళ్లి రైతులను పరామర్శించి భరోసా కల్పించారు. అక్కడికక్కడే ఎకరాకు రూ. 10 వేల నష్టపరిహారం ప్రకటించి అమలు చేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్.. ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలి. జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అచనా వేయడంతో పాటు, ఎకరాకు రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## కెసిఆర్ సారథ్యంలోనే పనిచేస్తాం

**పార్టీ మారపు ప్రచారంపై మండిపడ్డ ఎర్రబెల్లి - ఆకురాలే కాలమన్న మాజీ ఎమ్మెల్యే వినయ్**

పార్టీ మారే ఉద్దేశం లేదన్నారు. బీజేపీలోకి వెళ్తున్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని..బీఆర్ఎస్ కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకు ఇలా ప్రయత్నిస్తు న్నారని చెప్పారు. క్యాడర్ అవన్నీ నమ్మవద్దని ఎర్రబెల్లి సూచించారు. ఆనాడు వైఎస్సార్ ఎన్నో ఇబ్బందులు పెట్టిన తాను పార్టీ మారలేదని చెప్పారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్రావు ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఎర్రబెల్లి స్పందించారు. అసలు ప్రణీత రావు ఎవరో కుడా తెలియదన్నారు. నా పేరు చెప్పాలని ప్రణీత రావు మీద అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. బిజినెస్, ల్యాండ్ దందాలు, తప్పుడు పనులు చేసే నాయకులు అధికార పార్టీలోకి పోతున్నారని ఎర్రబెల్లి విమర్శించారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన ఫెయిల్ అయిందని ప్రజలు అనుకుంటున్నారని ఎర్రబెల్లి చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని.. ఎన్నికల కోసమే డ్రామా చేశారని ఆరోపించారు. కనీసం కేసీఆర్ పెట్టిన పథకాలు కూడా అమలు చేయట్లేదని విమర్శించారు. కార్యకర్తలు దైర్యంగా ఉండాల న్నారు. కార్యకర్తలు మీద తప్పుడు కేసులు పెడితే తాము పోలీస్ స్టేషన్ లో కూర్చుంటామని భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజ మన్న ఎర్రబెల్లి... ఎన్టీఆర్ లాంటి నాయకునికి కూడా ఓటమి తప్పలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లే నాయకులపై బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఫోటోతో గెలిచిన నాయకులు ఇప్పుడు పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీ మారిన నాయకులతో క్యాడర్ పోవట్లేదని చెప్పారు. పచ్చని చెట్టుకు ఎండిపోయిన ఆకులు రాలిపోయినట్టు పోతున్నారని అన్నారు. మళ్ళీ చెట్టు చిగురిస్తుంది, కాయలు కాస్తా యని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎండి పోయిన పొలాలు, కాలి పో తున్న మోటార్లు కనిపిస్తున్నాయని వినయ్ ఆరోపించారు. ప్రజల పక్షాన పోరా డుతామని తెలిపారు. రాష్ట్రంలోని చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్ మీద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తాను ఫుల్ టైం పొలిటీషియన్ అని తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పారు. పార్ట్ టైం పొలిటీషియన్ లు పార్టీ మారిన వచ్చే నష్టం ఏం లేదని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

## తెలంగాణ హైకోర్టుకు మరో ఇద్దరు జడ్జిలు

విన్నవించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల ఆధారంగా వీరి బదిలీకి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. 1967లో పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన జస్టిస్ మౌసమీ భట్టాచార్య 1997లో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. కోల్‌కతా, పట్నా, దిల్లీ, హైదరాబాద్ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. 2017 సెప్టెంబర్‌లో కోల్‌కతా హైకోర్టుకు అదనపు జడ్జిగా, 2019లో శాశ్వత జడ్జిగా నియమితులయ్యారు. జస్టిస్ సుజయ్ పాల్ 1990లో మధ్యప్రదేశ్ బార్ అసోసియేషన్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 2011లో మధ్యప్రదేశ్ అదనపు జడ్జిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## రిజర్వాయర్లలో సరిపడా నీటినిల్వలు

రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్, జీ.హెచ్.ఎం.సి కమిషనర్ రోనాల్డ్ రోస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, మిషన్ భగీరథ ఈ.ఎన్.సి. కృపాకర్ రెడ్డి తదితర అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా సి.ఎస్ మాట్లాడుతూ, యుద్ధప్రాతిపదికన మర మత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని, ఎవరైనా అదనపు వాటర్ ట్యాంకులు కోరితే వాటిని కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. మంచినీటి సరఫరా విషయంలో ఏవిధమైన ఆందోళనలు అవసరం లేదని అన్నారు. ఈ సందర్బంగా రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్నచర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షించారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షల స్ఫూర్తితో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని సి.ఎస్. తెలిపారు పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ రవీ గుప్తా, విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, విద్య శాఖ కమిషనర్ దేవసేనలు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఎస్.ఎస్.సి పరీక్షలు మొదలై రెండు రోజులు అయ్యాయని, మిగిలిన పరీక్షలను కూడా ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం తోపాటు ప్రతీ కేంద్రం వద్ద కనీసం ఒక కానిస్టేబుల్ లేదా హోమ్-గార్డును నియమించినట్టు తెలిపారు. పరీక్ష పేపర్లను తేవడం తిరిగి పోస్టాపీసీలు తీసుకెళ్లేటప్పుడు తగు బందోబస్తు ఉండాలని పేర్కొన్నారు. ఈవిషయంలో విద్యా శాఖ, పోలీస్ అధికారులు తగు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షలను విజయ వంతంగా నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్లను, అధికారులను సి.ఎస్ అభినందించారు.

# అందుబాటులోకి సి విజిల్' యాప్

## అక్రమాలపై నేరుగా ఫిర్యాదు చేసే సౌలభ్యం

న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు)




ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మరుక్షణం నుంచే 'సి విజిల్' యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలంటే సరైన సాక్ష్యాధారాలు ఉండాలి. అలాంటి సాక్ష్యాలను కేంద్ర ఎన్నికల సంఘం(ఇఅ) ముందు ఉంచడమే ఈ యాప్ లక్ష్యం. అక్రమాలకు సంబంధించిన ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్(ంఖఖ)లో ఫిర్యాదు చేయవచ్చు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే అన్ని వ్యవస్థలు ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లిపోతాయి. ఎక్కడైనా అధికార పార్టీకి వ్యవస్థలు అనుకూలంగా ఉండకుండా అందరికి సమాన అవకాశాలు కల్పించేలా చేస్తుంది ఈసీ. ఈ క్రమంలోనే ప్రజలకి కూడా కొన్ని అధికారాలు ఇస్తోంది ఎన్నికల సంఘం. మీ ప్రాంతాల్లో అక్రమాలు జరిగినా అధికార దుర్వినియోగం కానీ, లేదా డబ్బుల పంపిణీ, ఇతర ప్రలోభాలు జరిగినా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావచ్చు. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్'యాప్ ద్వారా అందరి అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చే అవకాశం కల్పించింది.

# కవితక్కా..తీహార్ జైలుకు స్వాగతం

## ఆ తరవాత వచ్చేది ఇక కేజ్రీవాలే - జైలునుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ

న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు)



ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఇప్పటి వరకూ కవితను టా÷-గ్గం÷ట్ చేస్తూ ఆయన ఎన్నో లేఖలు విడుదల చేశారు. కవితకు.. తనకు మధ్య జరిగిన ఛాటింగ్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్ధాలని తేలింది. ఇన్నాళ్లకు నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడు వెంటాడుతోందని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు. నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.. రెండోది తిహార్ (÷ు।రజీస ఏజీతి) క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైంది. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయన్నారు. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!..నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి. ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్ లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా.. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా.. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చు కున్నా.. 'సినిమా ఇంకా మిగిలే ఉంది'. కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా ÷-లకైమాక్స్‌కు చేరుకుంది. కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను' అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.

# అధికారులు బ్రహ్మోత్సవాలు సమన్వయంతో నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల మార్చి 19 (ప్రజా మంటలు)




శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ధర్మపురి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు.
మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా స్వామివారి కళ్యాణోత్సవం, రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు జరిగే రోజులలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి అధికార యంత్రాంగాన్ని నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖులు, ముఖ్యులు దర్శనానికి వచ్చే సమయంలో ప్రోటోకాల్ పాటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్య దేవాలయం, శివాలయంలలోకి వెళ్ళే భక్తులను క్యూ లైన్ నిర్వహణకు అవసరమైన పోలీస్, వాలంటీర్లను నియమించడం జరుగుతుందని, వాహనాల పార్కింగ్ నకు బ్రాహ్మణ సంఘం, హరిత హోటల్ ప్రక్కన గల ప్రాంతాలలో పార్కింగ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ పార్కింగ్ కు జూనియర్ కళాశాల, నక్కల పేటలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయం, మంగళ్ గడ్డ, కమ్యూనిటి హెల్త్ సెంటర్, నిఫ్ కాలేజి, బస్టాండ్ ప్రాంతాలలో మెడికల్ క్యాంపు లను నిరంతరంగా ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరమైన కొన్ని ప్రాంతాలలో చలి వెంద్రాలు ఏర్పాటు చేయాలని, త్రాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ప్రాంతాలలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. తెప్పోత్సవం, డోలోత్సవం జరిగే కోనేరు ప్రాంతంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బారికేడింగ్ చేపట్టాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. అన్నదాన కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను పరిశు భ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ మెయింటేన్ చేయాలని అన్నారు. సంతోషి మాట వి.ఐ.పి. ఘాట్, మంగళ్ గడ్డ ఘాట్, హరిత హోటల్ వెనుక భాగాలలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, దేవస్థానం ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అన్నారు. స్వామివారికి జరిగే కార్యక్రమాలను పట్టణంలో వివిధ ప్రాంతాలలో చూసేందుకు ఎల్.ఈ.డి. స్క్రీన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జాతర జరిగే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాతరలో స్వామివారి దర్శనం చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రవాణ సౌకర్యాలకు ఆర్టీసి బస్సులను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆపదలో ఆదుకునేందుకు, విద్యుత్ షాట్ సర్క్యూట్ ను అదుపు చేయడానికి అగ్నిమాపక వాహనాలను సిద్దంగా ఉంచాలని అన్నారు. జాతర సమయాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలో శానిటేషన్ కార్యక్రమాలను, మున్సిపల్, పంచాయతీ అధికారుల నేతృత్వలో నిర్వహించాలని అన్నారు. ఆయా విధుల నిర్వహణకు నియమించిన అధికారులకు అవసరమైన కింది స్థాయి ఉద్యోగులను కేటాయించడం జరిగిందని తెలిపారు.
ఈ సమావేశంలో డిఎస్పి రఘు చందర్, జగిత్యాల ఆర్డిఒ మధు సుధన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, దేవాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజావాణికి తాత్కాలిక బ్రేక్

## ఎన్నికల ఫలితాల తరవాత తిరిగి ప్రారంభం

హైదరాబాద్,మార్చి19 (ప్రజా మంటలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తీసుకున్న నిర్ణయాలలో ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ప్రజావాణి కార్యక్రమానికి డిసెంబర్ శ్రీకారం చుట్టారు. అయితే ప్రజావాణి కార్యక్రమాన్ని కొన్ని రోజులపాటు నిలిపివేశారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.మే 13న రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నాది. జూన్ 4న ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటించనున్నారు. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 6న ఎన్నికల పక్రియ అధికారికంగా ముగుస్తుంది. దాంతో జూన్ 7 నుంచి తిరిగి ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా కొనసాగించనున్నట్లు నోడల్ అధికారి వెల్లడించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూముల సంబంధిత సమ్యలు, ధరణి, ఆరోగ్యం,నిరుద్యోగం అంశాలపైనే ప్రజలు ప్రభుత్వానికి ఎక్కువ వినతిపత్రాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వారానికి రెండు రోజులు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. మంగళవారం, శుక్రవారాల్లో కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే నిర్ణయించారు. ఆ రెండు రోజుల్లో జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌కు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు చెప్పుకునేవారు.

# తిరువనంతపురంలో అభ్యర్థిని నిలపడం దారుణం

## సిపిఐది మిత్రద్రోహం అంటూ శశిథరూర్ ఆగ్రహం



తిరువనంతపురం,మార్చి19 (ప్రజా మంటలు)

'ఇండియా' కూటమి భాగస్వామిగా ఉన్న లెఫ్ట్ పార్టీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మండిపడ్డారు. తిరువనంతపురం నుంచి పోటీ చేస్తున్న తనపై అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా ఓట్లను చీల్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. శశిథరూర్ తిరువనంతపురం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. తాజాగా మరోసారి తిరువనంతపురం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.
గత రెండు ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. విపక్ష పార్టీల ఐక్యత గురించి నిజంగానే వారికి (సీపీఐ) చిత్తశుద్ధి ఉంటే నా ఓట్లకు గండిపడేలా తమ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టారు? నాకు వ్యతిరేకంగా వారి ప్రచారం సాగుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా ఆ పార్టీ ప్రచారం చేసినట్టు నా చెవిన పడలేదు. మైనారిటీ ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని థరూర్ మంగళవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. థర్డ్ పార్టీగా ఉన్న బీజేపీకి మాత్రమే ఉపయోగపడే ఎత్తుగడ ఇది. సీపీఐను నేను ఒకటే ప్రశ్న అడుగుతున్నాను. మీరు మాట్లాడింది ఏమిటి? ఇక్కడ చేస్తున్నదేమిటి? కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలనే నేను వారికి చెప్పదలచుకున్నాను అని శశిథరూర్ అన్నారు. దీనికి ముందు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదకగా చేసిన పోస్ట్‌లోనూ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. వయనాడ్‌లో రాహుల్‌గాంధీ అభ్యర్థిత్వానికి సమ్మతి తెలిపిన సీపీఐ.. తిరువనంతపురం మాత్రం బీజేపీ గేమ్ ఆడుతుండటం బాధాకరమని అన్నారు. తిరువనంతపురంలో తనకు వ్యతిరేకంగా సీపీఐ చేసే ప్రచారం వల్ల బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయన్నారు. వయనాడ్ విషయంలో కూటమి ధర్మం గురించి మాట్లాడుతూ, తిరువనంతపురంలో ఇందుకు భిన్నంగా లెఫ్ట్ పార్టీ ప్రవర్తించడం సరికాదని అన్నారు. అయితే శశిథరూర్ వ్యాఖ్యలను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తిప్పికొట్టారు. శశిథరూర్ వంటి బాగా చదువుకున్న వ్యక్తి కేరళ చరిత్రను సరిగా అర్థం చేసుకోవాలని అన్నారు. మతతత్వ, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన పార్టీ తమదని, అనేక మంది కాంగ్రెస్ నేతలు సొంత పార్టీని వీడి బీజేపీలో చేరారని ఆయన గుర్తు చేశారు. 20 లోక్‌సభ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 26న ఎన్నికలు జరుగనున్నాయి.

# బిజెపిలో చేరిన మాజీ బ్యూరోక్రాట్

## అమృత్‌సర్ నుంచి పోటీచేయనున్న తరణ్‌జిత్ సింగ్


న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు)

అమెరికాలో భారత మాజీ రాయబారి తరణ్‌జిత్ సింగ్ సంధు మంగళవారంనాడు అధికారికంగా బీజేపీలో చేరారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు వినోద్ తావ్డే, తరుణ్ చుగ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా, బీజేపీలో అధికారికంగా చేరిన తరణ్‌జిత్ సింగ్‌కు పంజాబ్‌లోని అమృత్ సర్ నుంచి లోక్‌సభ టిక్కెట్ ఇచ్చే ఆలోచనలో ఆ పార్టీ ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అమృత్‌సర్ నుంచి ఆప్ అభ్యర్థిగా కుల్దీప్ సింగ్ ధలివాల్ పోటీలో ఉన్నారు. కాగా, పార్టీలో తనకు అవకాశం కల్పించిన బీజేపీ అధినాయక త్వానికి సంధు కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవలు అందించేందుకు వీలుగా తన కొత్త జర్నీ మొదల వుతోందన్నారు. తనను ప్రోత్సహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కృతజ్ఞతలు చెప్పారు. 'గత పదేళ్లుగా ప్రధానమంత్రి మోదీ నాయకత్వానికి చాలా దగ్గరగా పనిచేశారు. ముఖ్యంగా అమెరికా, శ్రీలంకతో సంబంధాలపై పనిచేశాను. అభివృద్ధి అంశంపై ప్రధాని ఎక్కువగా ఫోకస్ చేశారు. ఇవాళ అభివృద్ధి అనేది చాలా ముఖ్యం. ఇదే అభివృద్ధి అమృత్‌సర్‌కు కూడా చేరాలి' అని ఆయన అన్నారు.

# శరద్ పవార్‌కు సుప్రీంలో ఊరట

## బూర ఊదుతున్న గుర్తుకు అనుమతి

న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు):



లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు 'ఎన్‌సీపీ-ఎస్‌సీపీ' పేరుతో పాటు 'మనిషి ఊదుతున్న తుర్రా' చిహ్నాన్ని ఉపయోగించుకోవచ్చని.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది. ఆ చిహ్నాన్ని శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్నికల చిహ్నంగా రిజర్వ్ చేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ గుర్తును ఏ ఇతర పార్టీకి లేదా అభ్యర్థికి కేటాయించరాదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో.. ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరుని గానీ, ఫోటోలను గానీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించకుండా అజిత్ పవార్ వర్గాన్ని అత్యున్నత న్యాయస్థానం నిషేధించింది. అలాగే, గడియారం గుర్తుకు సంబంధించిన వివాదాస్పద అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ గడియారం గుర్తు 'కోర్టులో పరిశీలనలో ఉందని' పబ్లిక్ నోటీసు జారీ చేయాలని అజిత్ పవార్ వర్గాన్ని కోర్టు చెప్పింది. ఇంగ్లీష్, హిందీ, మరాఠీ భాషల్లో ఈ నోటీసులు ఇవ్వాలని.. అన్ని ప్రచార ప్రకటనల్లో కూడా ఆ అంశాన్ని ప్రస్తావించాలని సూచించింది. అంతకుముందు.. అజిత్ పవార్ వర్గాన్ని నిజమైన ఎన్‌సీపీగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదిలావుండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం పేరు, ఫోటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ శరద్ పవార్ వర్గం గతవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ప్రత్యేకంగా పార్టీ ఉన్నప్పుడు శరద్ పవార్ ఫొటోను ఎందుకు వినియోగిస్తున్నారని అజిత్ వర్గాన్ని కోర్టు ప్రశ్నించింది. సొంత పార్టీ గుర్తింపుతో ముందుకు వెళ్ళాలని సూచించింది. శరద్ పవార్ పేరు, చిత్రాలను ఉపయోగించబోమని హామీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగానే తాజాగా శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు కొత్త చిహ్నాన్ని జారీ చేసింది.

# 2026 నాటికి దేశంలో తొలి బుల్లెట్ రైలు

## కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి19 (ప్రజా మంటలు)



అహ్మదాబాద్-ముంబయి మధ్య 2026 నాటికి దేశంలోనే తొలి బుల్లెట్ రైలు సర్వీసును ప్రారంభిస్తామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. భారతదేశపు మొదటి బుల్లెట్ రైలు 2026లో సిద్ధంగా ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. అహ్మదాబాద్-ముంబయి హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిర్మాణం పొడవు 508 కిలోమీటర్లుగా ఉంది. 2028లో పూర్తిస్థాయి విస్తరణ పూర్తవుతుందని ఆయన అన్నారు. తద్వారా ఈ ప్రాజెక్టు మార్గంలోని పట్టణాలు, నగరాల రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. జపాన్ కు చెందిన షింకన్‌సెన్ టెక్నాలజీ సహాయంతో రూ. 1.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో బుల్లెట్ రైలు ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. 2026 నాటికి సేవలు ప్రారంభమవుతాయని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. థానే నుంచి ముంబయి చేరుకోవడానికి ఈ మార్గం సముద్ర సొరంగం గుండా సాగుతుంది. ఈ మేరకు సముద్ర సొరంగం పనులు ప్రారంభమయ్యాయి. ముంబయి, అహ్మదాబాద్ మధ్య మొదటి హై-స్పీడ్ రైలు కారిడార్ 320 కిమీ వేగంతో బు÷-లలెట్ రైళ్లను నడుపుతుందని కేంద్రం 2017లోనే ప్రకటించింది. రైల్వేల ద్వారా అధునాతన ప్రణాళికకు అన్ని స్థాయిల్లో కృషి, కమ్యూనికేషన్ అవసరమని రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

# మహారాష్ట్రలోనూ బిఆర్ఎస్‌కు షాక్

## కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మాణిక్‌రావు కదం రాజీనామా

ముంబై, మార్చి19 (ప్రజా మంటలు): బీఆర్ఎస్‌ను కష్టాలు వీడటం లేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు మారిపోయాయి.ఓ వైపు తెలంగాణలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు ఆ పార్టీని గుడ్‌బై చెబుతుంటే.. పక్క రాష్ట్రం మహారాష్ట్ర లోనూ బీఆర్ఎస్ నేతలు కారు దిగి వేరే పార్టీల్లో చేరుతున్నారు. లోక్‌సభ(ఒనీ ÷ూజీశిరజీ) ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీపై బీఆర్ఎస్ అధిష్టానం క్లారిటీ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ నేతలు ఎవరిదారి వారు చూసుకుంటున్నారు.తాజాగా మహారాష్ట్ర కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మాణిక్‌రావు కదం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆయనతో పాటు పలువురు స్థానిక నాయకులు కారు దిగి వెళ్లిపోతున్నారు. మానిక్‌రావు కదం మహారాష్ట్రలో ప్రముఖ నాయకుడిగా ఉన్నారు. గతంలో కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి.. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. మొదటగా మహారాష్ట్రలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. దీనిలో భాగంగా మహారాష్ట్రలో పలు పార్టీల నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు.
తెలంగానలో బీఆర్ఎస్ ఓటమి చెందటంతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ కొంత నిరుత్సాహనికి లోనయ్యారు. ప్రస్తుతం తెలంగాణలోని లోక్‌సభ స్థానాపై గులాబీ బాస్ ఫోకస్ పెట్టారు. దీంతో మహారాష్ట్ర నేతలు కేసీఆర్ వైఖరిపై అసంత?ప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌ను వీడిన మాణిక్‌రావు కదం ఎన్సీపీలో చేరారు. గత ఏడాది జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు కొంతమేర ప్రభావం చూపించగలిగారు. దీంతో మహారాష్ట్రలో ఇక నుంచి జరగబోయే ఎన్నికల్లో పోటీచేయాలని కేసీఆర్ భావించారు. కాని తెలంగాణలో ఫలితాల తర్వాత గులాబీ బాస్ సైలెంట్ అయినట్లు తెలుస్తోంది.

# ఎస్‌బిఐ దోబూచులాట ఎవరి కోసం ?




గతంలో ఎన్నికల నిధుల సేకరణ అంతా గోప్యంగా జరిగేది. ఎవరు ఎంత ఎవరికి ఇస్తున్నారో తెలిసేది కాదు. ఇందులో వచ్చే సొమ్ము కొంత వ్యక్తుల జేబుల్లోకి వెళ్లేది. ఎన్నికల బాండ్లు వచ్చాక ఎవరు ఎవరెవరికి ఇస్తున్నారో తెలిసింది. ఇది బహిరంగ రహస్యం. దీంట్లో దాచాల్సిన అవసరం లేదు. ప్రతిదీ ప్రజలకు తెలియాల్సిందే. అలాంటప్పుడు ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాచాల్సింది కూడా ఏమీలేదు. బాండ్ల వివరాలను పదేపదే సుప్రీం ఆదేశించినా దాచిపెట్టడం ఎవరికోసం, ఎందుకోసం అన్నది తెలియాలి. ఇందులో అన్ని పార్టీల వారికి బాండ్లు ముట్టాయి. ఎవరు ఎంతెంత ఏ కంపెనీల నుంచి పొందారో కూడా తెలిసింది. అలాంటప్పుడు సుప్రీం ధర్మాసనం అడిగిన వివరాలను ఇంకా దాచిపెట్టాల్సిన అసవరం ఎస్‌బిఐకి లేదు. ఎందుకంటే సుప్రీం అడిగిన తరవాత అన్నీ ఇవ్వాల్సిందే. మళ్లీ మళ్లీ చీవాట్లు పెట్టించుకునే దాకా వ్యవహారం తేరాదు. ఇలా చేయడం వల్ల బ్యాంక్‌పై నమ్మకం పోతుంది. ఇంత గోప్యత పాటించే బ్యాంక్ వ్యవహారాలపై సామాన్యులకు నమ్మకం సన్నగిల్లుతుంది. ఏదయినా ఓపెన్ గా ఉండడం అవసరం. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన తరవాత కూడా ఎస్‌బిఐ వ్యవహరిస్తున్న తీరువల్ల ఇంతకాలం ఉన్న విశ్వసనీయత చెడిపోయే ప్రమాదం ఉంది.దేశీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ జాబితాల్లోనూ చోటు సాధించిన ఈ బ్యాంకు ఎన్నికల బాండ్ల విషయంలో ఇలా వరుసపెట్టి సర్వోన్నత న్యాయస్థానంతో చివాట్లు తినడం సరికాదు. నిజాయితీ, పారదర్శకతలకు పెద్దపీట వేయాల్సిన ఈ సంస్థ, తనకు తానుగానే తప్పటడుగులు వేస్తున్నదో, పాలకుల ఒత్తిడికి లొంగిపోతున్నదో తెలియాల్సి ఉంది. ఒకవేళ పాలకులు అడ్డుపడితే కూడా నిర్భయంగా చెప్పుకోవాలి. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారంగా చూడాలి. తాజాగా ఎస్‌బిఐ వ్యవహరిస్తున్న తీరుతో ఆ బ్యాంకుతో దశాబ్దాల అనుబంధం ఉన్న సామాన్యులకు మాత్రం ఎంతో అవమానంగా ఉంది. ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారన్న కీలక సమాచారాన్ని తెలియచెప్పే యూనిక్ బాండ్ కోడ్స్ సహా తన వద్ద ఉన్న సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి అందచేయాల్సిందేనంటూ బ్యాంకును పదేపదే సుప్రీంకోర్టు ఆదేశించినా...అసంపూర్తి సమాచారంతో సుప్రీం ధర్మాసనం ఆగ్రహానికి గురయ్యింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు గౌరవప్రదమైన భాషనే ఉపయోగిం చినప్పటికీ, బ్యాంకు కొంత సమాచారాన్ని దాస్తున్నదనీ, తాను ఎంపిక చేసినదానిని మాత్రమే అందిస్తున్న దని, కీలకమైన లింకులను దాచిపెడుతున్నదని సుప్రీం వ్యాఖ్యలను బట్టి తెలుసుకోవచ్చు. ఎన్నికల సంఘానికి అంతా ఇచ్చేశానని, వీసమెత్తు సమాచారాన్ని కూడా దాచలేదని మార్చి 21వ తేదీ సాయంత్రం ఐదుగంటలలోపు బ్యాంకు చైర్మన్ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసుకోవాల్సి ఉంది. కోర్టు ఏది అడిగితే అది అందించడానికి బ్యాంకు సంసిద్ధంగా ఉందని దాని తరఫు న్యాయవాది హరీష్ సాల్వే అంటున్నారు కానీ, ఫిబ్రవరి 15 ఆదేశాలను అమలు చేయాలన్న ఉద్దేశం బ్యాంకుకు ఏ మాత్రం ఇష్టంలేదని ఆదిలోనే తేలిపోయింది.గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి వివరాలు ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని కోర్టు ఆదేశిస్తే, ఈ తీర్పు వెలువడిన మూడువారాలకు మళ్ళీ కోర్టుముందుకు వచ్చి, జూన్ 30వరకూ గడువు పెంచాలని ఎస్‌బీఐ విన్నవించుకోవడంలో అర్థం లేదని తేలింది. వివరాలు దాచాల్సిన అవసరం బ్యాంక్‌కు లేదు. విదేశీలు అడిగితే తప్ప వివరాలు దాచాల్సిన అవసరం బ్యాంకుఉకు లేదు. కానీ దేశ సర్వోన్నత న్యాయస్థానమే ఆదేశించినా దోబూచులాడడం అన్నది సరికాదు. సార్వత్రిక ఎన్నికల్లోగా బాండ్ల రహస్యాన్ని బట్టబయలు చేయాలని, సమస్త వివరాలను ప్రజల ముందు ఉంచాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎన్నికలు ముగిసేవరకూ ఆ రహస్యాన్ని దాచాలని బ్యాంకు చూసింది. దీనిపై ఆగ్రహించిన సుప్రీంకోర్టు గడువు ఏ మాత్రం పొడిగించకుండా బ్యాంకును గట్టిగానే ఆదేశించింది. వివరాలు వెల్లడించాల్సిందేనని కొంత గట్టిగానే ఆదేశించింది. సుప్రీం ఆగ్రహంతో విధిలేక అది ఎన్నికల సంఘానికి సమాచారాన్ని అందించాల్సి వచ్చినప్పటికీ, కీలకమైన లింకులు లేకుండా చేసి, సర్వోన్నత న్యాయస్థానం తీర్పువెనుక స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు, ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం దేనికదిగా ఉంటూ ఏ పార్టీకి ఏ దాత ఎంత ఇచ్చాడన్న వివరాలను జతచేయగలిగే అవకాశం లేకుండా జాగ్రత్తపడ్డ తీరు అనుమానాలు రేకెత్తిస్తోంది. కంపెనీలకు, పార్టీలకు మధ్య బాండ్లతో ఏర్పడిన బంధం అనండి లేదా క్విడ్ ప్రోకో అనండి..అది ప్రజలకు తెలియాల్సి ఉంది. ఎందుకంటే ఏ కంపెనీకి అధికార పార్టీవారు ఫేవర్ చేస్తున్నారో కూడా తేలిపోతుంది. సుప్రీంకోర్టు ఈ ఎన్నికల బాండ్ల విధానాన్ని రద్దుచేయడానికి ప్రధాన కారణం ప్రతీదశలోనూ ఉన్న గోప్యతే. రాజకీయ పార్టీలకు గుప్తనిధులను సమకూర్చిపెట్టే ఈ విధానానికి కర్తగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టు ఏమిచెప్పినా, ఎంత మొత్తుకున్నా వివరాలు బట్టబయలు కకూడదని అనుకుంటోంది. వివిధ పారిశ్రామిక వేత్తల సంఘాలు సంస్థలు కూడా ఏవో కేసులు వేస్తూ, ప్రత్యేక అభ్యర్థనలు చేస్తూ కోర్టును ఇబ్బంది పెడుతున్నాయి. చివరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా బరిలోకి దిగారు. ఎన్నికల బాండ్లమీద కోర్టుకు ఎక్కి విజయం సాధించినవారు, ఆ వివరాలను వక్రీకరిస్తున్నారని, బాండ్ల లెక్కలను తారుమారు చేస్తున్నారని సోమవారం తుషార్ మెహతా కోర్టుకు ఫిర్యాదుచేశారు. కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ఒక ఎజెండా ప్రకారం ప్రభుత్వాన్ని ఇబ్బందికి గురిచేస్తున్నారనీ, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన వాదన. ఎన్నికలబాండ్ల విధానాన్ని న్యాయస్థానం కొట్టివేయడం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారపక్షానికి ఇబ్బంది కలిగించే విషయమే. అయితే సుప్రీం ఆదేశాలను తూచ తప్పకుండా అమలుచేయకుండా దాచిపెట్టే క్రమంలో ఎస్‌బిఐ వ్యవహరిస్తున్న తీరే ప్రభుత్వాన్ని అప్రదిష్టపాల్జేస్తున్నది. అనుమానాలకు తావిచ్చేలా చేస్తోంది.

# సనాతన సాంప్రదాయాల సిరి ధర్మపురి

### ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుండి ఏప్రిల్ 1వరకు బ్రహ్మోత్సవాలు

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు మార్చి 20వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు సాంప్రదాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర, పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా ఫాల్గుణ శుక్ల ఏకాదశి నుండి 13రోజులు వరుసగా స్థానిక దైవాల వార్షిక ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది.

"భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస,
దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుస్తం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. అవిభక్త కరీంనగర్ జిల్లా కేంద్రానికి క 71 కిలోమీటర్ల ఉత్తరాన, ప్రస్తుత జగిత్యాల జిల్లా కేంద్రానికి 27 కిలోమీటర్ల ఈశాన్యన, తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షే త్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నది క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, అపురూపమైన బ్రహ్మ, యమ ధర్మరాజు దైవాలతో త్రైమూర్త్య క్షేత్రంగా, శ్రీలక్ష్మీనర సింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు అనాదిగా పక్కపక్కనే కలిగి, పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలతో... వైష్ణవ, శైవ ముస్లిం, క్రైస్తవ మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ గోదావరీ తీరస్త పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికి సింగన పద్మ పురాణంలో, చెరికొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనా మాత్యుని నారాయణ శతకంలో, పింగళి సూరనా ర్యుని కళాపూర్ణోదయంలో, శేషాచలదాసు... నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయా నంతర శాసనాలలో, మధ్యయుగ దాన పత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది.

పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకితమై, నృసిం హుడు భక్తుల కోర్కెల తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి. గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టు కునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి" "గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశదపరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ, అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మరాజు, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగవతాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాల యపు కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయం లోని గణేష చండిక, సప్తమాతృకలు, నల్లశనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగము లందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై, విధర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియ నిజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నరసింహ ఆలయం, రామేశ్వరాలయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, భాష్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్న సత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురి వాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.

క్షేత్ర ప్రాశస్త్యం

అద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్రమున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించు వారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణమందిర ములను ఉద్ధరించు వారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అనుభవించ గలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచు వారు నందనాది వనములతో సౌఖ్యములను అనుభవించగ లరని, శ్రీనృసింహు శాల్యన్నమును, దద్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రులగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానముల నొసంగువారు ముందు జన్మమున సార్వభౌము లగుదురని, క్షేత్రమున దీనాదులకు, దంపతులకు, బ్రహ్మచారులకు పశు పక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృ దేవతలు మోక్షమును పొంద గలరని, శౌనకాది మహర్షులకు నైమిషారణ్యము నందు సూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం విశద పరుస్తున్నది.



**నరసింహ అవతార ప్రత్యేకత**

రామకృష్ణాది అవతారములవలె గాక , నిర్యాణం లేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యా త్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, అకాల మృత్యుభయ ముండదని, దుష్ట గ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గల దని భక్తుల, సాంప్రదాయాచరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం. "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం: నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" అనే మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూ కాని చేతిగోళ్ళతో, హిరణ్య కశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, ఆంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదు లను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అమారాలకు భిన్నం..

**13రోజుల బ్రహ్మోత్సవాలు**

ఈ సంవత్సరం మార్చి 20 వతేదీ బుధ వారం నుండి ఏప్రిల్ 1వ తేదీ సోమ వారం వరకు, ప్రధానంగా మార్చి 21 వ తేదీ గోధూళి సుముహూర్తంలో స్వామి వారల కల్యాణోత్సవం, 24,25,26, తేదీలలో వరుసగా... బ్రహ్మ పుష్కరిణీ (కోనేరు)లో సాయంత్రం శ్రీ యోగానంద నరసింహ, శ్రీ ఉగ్ర నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల తెప్పోత్సవం, డోలోత్సవంబీ 29న సాయంత్రం రథోత్సవం, 30,31, ఏప్రిల్ 1 తేదీలలో ముప్వరు స్వామి వారల ఏకాంతోత్సవాలు ఘనంగా, సంప్రదాయ రీతిలో జరుగ నున్నాయి. నిత్య ఆరాధనలతో పాటు ప్రత్యేక, పూజాదికాలు నిర్వహించ నున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం, జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా అధ్యక్షతన, దేవస్థానం ఏసీ, ఈఓ శ్రీనివాస్, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాల ఏర్పాట్ల నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.

# తమిళనాట కాలుమోపే లక్ష్యం

### నాలుగైదు ఎంపి సీట్లపై బిజెపి గురి

## పావులు కదుపుతున్న కాషాయదళం

చెన్నై, మార్చి 19 (ప్రజామంటలు): తమిళనాడులో కాలుమోపేందుకు బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. ఈసారి కనీసం ఓ నాలుగైదు సీట్లు గెల్చుకోవాలని చూస్తోంది. 400కుపైగా లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కషాయ దళానికి దక్షిణాది రాష్ట్రాల్లో గెలుపు కచ్చితంగా అవసరమని భావిస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా తమిళనాట అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల కోసం బీజేపీ అధినాయకత్వం సరికొత్త వ్యూహం రచిస్తున్నది. తమిళనాడులో పోటీకి గవర్నర్ తమిళసై రాజీనామా చేసి మరోమారు రంగంలోకి దిగారు. గతంలో తమిళసై ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలుగా పనిచేశారు. ఎక్కడ ఎలా వ్యూహం పన్నాలో ఆమెకు బాగా తెలుసు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. 400 ప్లస్ సీట్లను ఎన్డీయే టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందుకోసం దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కచ్చితంగా అవసరమని భావిస్తోంది. ఈ క్రమంలోనే లక్ష్యం దిశగా..సీట్ల కేటాయింపుల విషయంలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. తమిళనాడులో ఇప్పటికే దినకరన్, మాజీ సీఎం పన్నీర్ సెల్వంతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అయితే తాజాగా ఎన్డీయే కూటమిలో చేరిన పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) కు 10 సీట్లను కేటాయించి ఆసక్తికర చర్చకు దారి తీసింది. పీఎంకే నిర్ణయంతో తమిళనాడు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అన్నాడీఎంకే (ఏఐఏడీఎంకే) లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సీనియర్ రాజకీయ నాయకులలో ఒకరైన పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్ రామదాస్ పొత్తు, సీట్లపై చర్చలు బీజేపీతో కాకుండా ఏఐఏడీఎంకేతో జరపాలని అనుకున్నారు. చర్చలు జరిపేందుకు ఏఐఏడీఎంకే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి వద్దకు ఓ దూతను పంపారు. అదే సమయంలో చెన్నైకి 120 కిలోమీటర్ల దూరంలోని తైలాపురంలో సమావేశమైన పీఎంకే అత్యున్నత స్థాయి కమిటీ బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. అన్నాడీఎంకేని కాదని బీజేపీతో పొత్తు పెట్టుకోవాలనే నిర్ణయాన్ని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రతిపాదించారు. ఆ పార్టీ ఏఐఏడీఎంకేతో తెగతెంపులు చేసుకుని బీజేపీతో పొత్తుతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. పొత్తుపై పీఎంకే ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్ మాట్లాడుతూ.. 'బీజేపీతో పొత్తు పెట్టుకుని లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటామని పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్ రామదాస్ అత్యున్నత స్థాయి కమిటీ సమావేశంలో ప్రకటించినట్లు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కూటమిలో చేరాలనే నిర్ణయాన్ని రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి సంయుక్తంగా తీసుకున్నారని' చెప్పారు. పీఎంకేలో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని పార్టీ నేతలు వెల్లడించారు. అధికారిక ఎన్నికల ఒప్పందంపై సంతకం చేసేందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై తైలాపురం వెళ్లనున్నారు. బీజేపీ కూటమిలో చేరాలని పీఎంకే తీసుకున్న నిర్ణయం, అధికార పార్టీ డీఎంకే, ప్రతిపక్ష పార్టీ ఏఐఏడీఎంకేలకు ధీటుగా బీజేపీ ఎదిగేందుకు.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం చేస్తున్నాయి. గతంలో బీజేపీ ఎన్డీయే కూటమిలో అన్నాడీఎంకే భాగస్వామిగా ఉండేది. అన్నామలై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నాడీఎంకే నేతల అవినీతిపై ఆరోపణలు చేశారు. దాంతోపాటు దివంగత ముఖ్యమంత్రి జయలలితను విమర్శించడంతో ఇరు పార్టీల మధ్య విభేదాలు పెరిగాయి. ఈ క్రమంలోనే ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అన్నాడీఎంకే ప్రకటించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని 15మంది మాజీ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని బీజేపీలో చేర్చుకుంది.

తాజాగా, లోక్‌సభ ఎన్నికల్లో వన్నియార్ సామాజిక వర్గంలో దాదాపు 6 శాతం ఓటు బ్యాంకు ఉన్న పీఎంకేతో జతకట్టింది. ఉత్తర తమిళనాడులో ఓటు షేర్ పెంచుకోవాలని భావిస్తున్న బీజేపీకి పీఎంకేతో పొత్తు మరింత లబ్ది చేకూర్చుతుంది. దక్షిణ తమిళనాడు అంతటా ఆధిపత్య వర్గాలను ఆకర్షించడంలో అన్నాడీఎంకే నాయకులు ఓ పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్‌ల మద్దతు కూడగట్టుకుంది. లోక్‌సభ ఎన్నికలే కాదు తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసేలా మోదీ వరుస పర్యటనలు చేయడంతో పాటు, భారీగా నిధులు కేటాయించేందుకు కేంద్రం సిద్ధమైంది.

## రచయితలకు, కవులకు ఆహ్వానం

కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన "నేటి కథ" శీర్షిక మళ్ళీ ప్రారంభిస్తున్నాం. అలాగే కవితలను కూడా వారంలో ఒక రోజు ప్రచురించనున్నాం. మీ రచనలను, సామాజిక స్పృహతో, నేటి తరానికి మన సంస్కృతి, వారసత్వాన్ని అందించే కథలకు, కవితలను ఆహ్వానిస్తున్నాం. మీ కాలానికి పదను పెట్టి, సమాజాన్ని తీర్చిదిద్దే రచనలను సృష్టించాలని, తార్కిక, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా, సామాజిక అంశాలను కథావస్తువుగా తీసుకొని రచనలు చేయాలని మా విజ్ఞప్తి. మీ రచనలను ఈ కింది ఈ మెయిల్ కు పంపండి. మీ రచనతో పాటు హామీని, మీ పూర్తి చిరునామాను, ఫోటో ను కూడా జతచేయడం మరవకండి. మీ రచనలను వర్డ్ డాక్యుమెంట్, పేజ్ మేకర్ 7.0 ఓపెన్ ఫైల్ గా మాత్రమే పంపండి. కథలను 400- 500 ల పదాలకు పరిమితం చేస్తే బాగుంటుంది.
ఇక మీదే ఆలస్యం ..

Email : mantalukathalu@gamil. Com

ఎడిటర్.

## రాయికల్ మండల గౌడ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయికల్ మార్చ్ 19 (ప్రజామంటలు): రాయికల్ మండల గౌడ సంఘము ఆధ్వర్యంలో నూతన మండల గౌడ సంఘము కార్యవర్గాన్ని జిల్లా గౌడ సంఘము అధ్యక్షుడు మాజీ గ్రంథాలయ చైర్మన్ డా. చంద్రశేఖర్ గౌడ్ ప్రకటించారు. మండల అధ్యక్షుడు గా ఉత్కమ్ సాయగౌడ్, ప్రధాన కార్యదర్శి జోగినిపెల్లి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులుగా కొత్తకొండ లింగం గౌడ్, నాగుల మల్లయ్య గౌడ్, కోశాధికారి గా బొంగోని బుమాగౌడ్, ముఖ్య సలహదారులుగా కైరి ముత్త గౌడ్, అనుపురం శ్రీనివాస్ గౌడ్, బత్తిని రాజేశం, పాలకుర్తి రవి, డిండిగాల రామస్వామి గౌడ్, బత్తిని వెంకటేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా జోగినిపెల్లి సురేందర్, గుర్రాల రాజేశం, గడ్డం రాజేశం గౌడ్, పాలకుర్తి వెంకటేష్ గౌడ్, బొంగు రాజు గౌడ్, గరపెల్లి శ్రీనివాస్ గౌడ్, తిరుమల రవి గౌడ్, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ లను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా గౌడ సంఘము అధ్యక్షుడు డా. చంద్రశేఖర్ గౌడ్, జిల్లా మెంబర్ అల్లకొండ సాయగౌడ్ లు అభినందించారు.



## పారా మిలటరీ బలగలతో ఫ్లాగ్ మార్చ్

### ప్రశాంతత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కులు వినియోగించుకోవాలి

ధర్మసాగర్ మార్చ్ 19 (ప్రజామంటలు): ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి ముప్పారం గ్రామాలలో ధర్మాసాగర్ పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో పారా మిలటరీ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏ. మహేందర్, మాట్లాడుతూ.... లోక్ సభ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా మండలంలోని పలు గ్రామాలలో పారా మిలటరీ మరియు పోలీస్ శాఖ సేవలు నిర్వహిస్తారని తెలిపారు ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతత వాతావరణం లో ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బండారి రాజు, పారా మిలిటరీ బలగాలు పాల్గొన్నాయి.



## జిల్లాలో మోడల్ కోడ్ అమలు

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

జగిత్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): భారత ఎన్నికల కమీషన్ లోకసభ ఎన్నికల నిర్వహణకు అనౌన్స్ మెంట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో మాడల్ కోడ్ అమలులోకి వచ్చినదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ా%. లోకసభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమీషన్ ప్రకటించిన దరిమిలా రాజకీయ పార్టీలు వారి ప్రచారం నిర్వహణలో భాగంగా ప్రచార వాహన, మైకు, ఇతరత్రా అనుమతి లకు సింగిల్ విండో పద్దతీలో సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కర పత్రాలు, ఫ్లెక్సీ లు, ఇతర ప్రచార సామాగ్రిల అనుమతులకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,09,311 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 3,40,627 మంది పురుషులు, 3,68,650 మంది స్త్రీలు, 34 మంది థర్డ్ జెండర్ లు ఉన్నారని తెలిపారు. దివ్యంగులు 31,954 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 785 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో పట్టణ ప్రాంతాలలో 201, గ్రామీణ ప్రాంతాల్లో 584 కేంద్రాలు ఉన్నాయని వివరించారు. కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూం నిరంతరంగా పనిచేస్తుందని తెలిపారు. అత్యవసర, ఇతర సేవలకు 1800 425 7620 కంట్రోల్ రూం నెంబర్ కు, 1959 హెల్ప్ లైన్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. మాడల్ కోడ్ అమలుకు 18 ఫ్లయింగ్ స్క్వాడ్, 18 స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీమ్ లు, 18 మాడల్ కోడ్ అధికారులు, 6 వీడియో వీవింగ్ టీమ్ లు, 91 సెక్టరల్ అధికారులను నియమించామని, 7 అంతర్ జిల్లా చెక్ పోస్టు లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించెందుకు రాజకీయ పార్టీల ప్రతినిదులు సహకరించాలని కోరారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ%ా%. రాజకీయ పార్టీలు వారి ప్రచారం కోసం అవసరమైన అనుమతులు పొందాలని, జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకూడదు అని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి పవర్ పాయింట్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి, అనుమతులు, వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఆర్డీఓ లు మధుసూదన్, ఆనంద్ కుమార్, డిప్యూటీ సిఈఓ రఘువరన్, రాజకీయ పార్టీల ప్రతినిదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవగా నూతన కార్యవర్గాన్ని అభినందించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్, కార్యదర్శి శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మానాల కిషన్, సీనియర్ నాయకులు రాచర్ల విజయ్, బాలరాజు, నారాయణ, గంగారాం, శంకర్, కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పి అనుబంధ సంఘాల నూతన కార్యవర్గం ఎంపిక

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడుగా నక్క సునీల్,

### ఎం.ఎస్.పి. మండల అధ్యక్షులుగా పార్నందుల సురేష్

భీమదేవరపల్లి మార్చ్ 19 (ప్రజామంటలు): మండలంలోని ముల్కనూర్ ఎస్.ఆర్.కె స్కూల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల సమావేశం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పి పార్టీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ా%. గత 30 సంవత్సరాల క్రితం షెడ్యూల్ వర్గీకరణ కోసం ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసిందని అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నూతన కమిటీలు నిర్మించుకొని మరో యుద్ధానికి తయారు కావాలని మందకృష్ణ మాదిగ పిలుపు నూతన కమిటీల నిర్మాణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమదేవరపల్లి మండల ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడిగా పార్నందుల సురేష్, ఉపాధ్యక్షులుగా కాదాస్ ప్రవీణ్ కుమార్, అధికార ప్రతినిధిగా మాడుగుల ప్రభుదాస్, జిల్లా సహాయ కార్యదర్శిగా నాగిళ్ల చందర్, ఎంఎస్పి మండల అధ్యక్షులుగా నక్క సునీల్ ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.




## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితునికి రెండు రోజుల జైలు

జగిత్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు లో ఓ యువకునికి రెండు రోజుల జైలు శిక్ష ఖరారైంది. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన (23) ఎం. అజయ్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గొల్లపల్లి రోడ్ లో జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు తనఖీ లు నిర్వహిస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ లో పరిమితికి మించి మందు సేవించి ఉన్నట్లు రూడీ అయింది. సదరు వ్యక్తి సంబంధిత పోలీస్ అధికారిపై అనుచితంగా ప్రవర్తించడంతో నిందితున్ని కోర్టులో ప్రవేశపెట్టగా గౌరవ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ జి. కరుణాకర్ నిందితుడు ఎం. అజయ్ కు రెండు రోజుల పోలీస్ కస్టడీ కి ఆదేశాలు జారీ చేశారు.

# ఎయిడ్స్ పరీక్షలు ఎక్కడ చేయించుకునేదీ?!

### జిల్లాలోనే ఐసీటీసీలు లేకపోవడం శోచనీయం

### భాస్కర వెంకటరమణ



మహాదేవపూర్ మార్చ్ 19 (ప్రజామంటలు): సమాజాన్ని గడగడలాడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని గుర్తించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పరీక్ష కౌన్సిలింగ్ కేంద్రాలు లేకపోవడం శోచనీయమని మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మహాదేవపూర్ తో పాటు చిట్యాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వీటిలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సిలింగ్ కేంద్రాలు ఐసిటిసి లు గత 19 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉండగా కేంద్ర ప్రభుత్వంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రేషనలైజేషన్ పేరిట ఐసీటీసీ కేంద్రాలను ఎత్తివేయడం దారుణమైన విషయమని వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు హెచ్ఐవి పరీక్ష ఎంతో అత్యవసరమని ఆవశ్యకమని భావిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కేంద్రంలోని వందపడకల మాతా శిశు జనరల్ ఆసుపత్రితో పాటు మెడికల్ కాలేజీలో కూడా ఐ సి టి సి లేని విషయాన్ని జాతీయ సంస్థలకు నివేదించకపోవడం జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు బహుశా తెలంగాణ రాష్ట్రంలోనే జిల్లా వ్యాప్తంగా మొత్తంగా ఐసిటిసి కేంద్రాలు లేని జిల్లా ఏదంటే జయశంకర్ భూపాలపల్లి జిల్లా గానే చెప్పుకోవచ్చు అని విమర్శించారు ఇదిలా ఉండగా ఇప్పటివరకు మహాదేవపూర్ ప్రాంతం తో పాటు చిట్యాల, భూపాలపల్లి ఆసుపత్రులలో ఐసిటిసిలు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహాదేవపూర్ కేంద్రంగా ఐసిటిసి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లయితే తెలంగాణ మహారాష్ట్ర, చత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలకు గిరిజన గూడాలాలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు. అలాగే మహాదేవపూర్, చిట్యాల ఐసిటిసి లతో పాటు ఇతర ప్రాంతాలలో హెచ్ఐవి పరీక్షలు చేయించుకుని ఎయిడ్స్ బారిన పడిన బాధితులు ఈ ప్రాంతంలో సుమారుగా ఉన్నటువంటి వారికోసం ఏ ఆర్ టి మందులు మహాదేవపూర్ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ కోరారు ఈ మేరకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లకు వినతిపత్రాలు సమర్పించినట్లు వెంకటరమణ విలేకరులకు వివరించారు.

## బొడ్డు మహేష్ ను సన్మానించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజు

సికింద్రాబాద్ మార్చ్ 19 (ప్రజామంటలు): బన్సీలాల్ పేట డివిజన్ న్యూ బోయిగూడ శ్రీసాయిబాబా ఆలయ నూతన అద్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు మహేశ్ ను డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ ఎల్.వెంకటేశన్ రాజు సన్మానించారు. మంగళవారం ఐడీహెచ్ కాలనీలోని డివిజన్ బీఆర్ఎస్ ఆఫీస్ లో జరిగిన కార్యక్రమంలో మహేశ్ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. తనపై అభిమానంతో సత్కరించిన బీఆర్ఎస్ నాయకులకు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి. వెంకటరమణ, గజ్జెల శ్రీనివాస్, కె. వెంకటేశ్, ఏసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## గాంధీ మెట్రోస్టేషన్ వద్ద గుర్తు తెలియని డెడ్ బాడీ

సికింద్రాబాద్ మార్చ్ 19 (ప్రజామంటలు): చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ మెట్రోస్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీ వెలుగు చూసింది. ఎస్.ఐ కరుణాకర్ రెడ్డి కథనం ప్రకారం.... గాంధీ మెట్రో స్టేషన్ సమీపంలోని మెట్రో ఫిల్లర్ నెంబర్ 1015 వద్ద కింద పడి ఉన్న 65%--%70 ఏండ్ల వయస్సు కలిగిన వృద్దుడి డెడ్ బాడిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని, చూడగా మృతుడికి సంబందించిన ఎలాంటి వివరాలు లభించలేదు. ఈ ప్రాంతంలో సంచరించే యాచకుడిగా భావిస్తున్నారు. డెడ్ బాడిని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు పట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ కోరారు.



## దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం

### రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటాం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

హైదరాబాద్ మార్చ్ 19 (ప్రజామంటలు): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి శాసన సభకుకు పోటీ చేసిన గొంటి విక్రమ్ యాదవ్ ఆధ్వర్యంలో మజ్లిస్ పార్టీ నాయకులు, బీ ఆర్ ఎస్ నాయకులు పెద్ద ఎత్తున చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి చిన్నారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.... దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ జోడో యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని చిన్నారెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు దూసుకుని పోతోందని చిన్నారెడ్డి తెలిపారు. వంద రోజుల రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రానున్న పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలు పించు కోవాలని చిన్నారెడ్డి పిలునిచ్చారు. గాంధీ భవన్ లో మజ్లిస్ పార్టీ నాయకులు విక్రమ్ యాదవ్ తో పాటు ఎం. శ్రీశైలం యాదవ్, బైకని శ్రీశైలం యాదవ్, గొంటి రాహుల్ యాదవ్, సాల్మాన్ రాజ్, ప్రేమ్, పద్మారావు, ప్రసాద్, జగన్నాథం, వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమ్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.



## విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

### పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలి

### పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

### పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్ మార్చి 19 (ప్రజామంటలు) : 10వ తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తూ మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. ఎంతమంది పరీక్ష రాస్తున్నారు.. ఎందరు హాజరయ్యారు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పరీక్షల చీఫ్ సూపరిండెంట్ ను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎండాకాలం నేపథ్యంలో పరీక్ష రాసిన తర్వాత విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నీరసం నుంచి ఉపశమనం కలుగుతుందని, బలం చేకూరుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష జరిగే సమయంలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్టీవో రమేష్ బాబు, తహసిల్దార్ విజయ్ కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ దేవారం మేరీ శోభారాణి, డిఓ వూరుగొండ సత్యప్రసాద్, ఏడిఓ బొప్పరాజు రమేష్, ఇన్విజిలేటర్స్, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గోడకూలి బాలుడు మృతి

జగిత్యాల,మార్చి19(ప్రజా మంటలు): జగిత్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోడకూలి నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. అ విషాదకర సంఘటన మేడిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మేడిపల్లిలోని పౌల్ట్రీ ఫాం నిర్మాణ పనులు జరుగుతుండగా కాంక్రిట్ మిక్సర్ వాహనం ఢీకొనడంతో గోడ కూలిపోయింది. అయితే గోడకు అవతలి వైపు ఆడుకుంటున్న బాలుడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నన్ను గెలిపించిండి..మీ గొంతుకనైతా

## వరంగల్ బిఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య

వరంగల్,మార్చి19 (ప్రజామంటలు): వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించమని ప్రజలందరిని కోరుకుంటున్నట్లు ఎంపి అభ్యర్థి కడియం కావ్య కోరారు. తనను గెలిపిస్తే మీ అందరి గొంతుకగా నేను ఢిల్లీలో మాట్లాడుతాను అని ఎంపీ అభ్యర్థి కడియం కావ్య తెలిపారు. వరంగల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం కావ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్. బీజేపీ కొత్తగా వచ్చిన పార్టీ కాదు.. గత పదేండ్ల నుంచి తెలంగాణకు అన్యాయం చేస్తూనే వస్తోంది. కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఎంపీలు వారి నాయకత్వం ప్రకారం నడుచుకుంటారు. వారికి వేరే ప్రయోజనాలు ఉంటాయి. కానీ బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్కు మాత్రం వేరే ప్రయోజనాలు లేవు. ఆయన కేవలం రాష్ట్రం కోసం పోరాడారు. తెలంగాణను సాధించారని కడియం కావ్య తెలిపారు. బిఆర్ఎస్కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. ఇది గమనించి తనను గెలిపించాలని ఆమె కోరారు.





జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ కార్యవర్గం, అభివృద్ధి కమిటీ సభ్యులు

## రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణ ఆహ్వాన పత్రిక ఎమ్మెల్యే సంజయ్ కు అందజేత



జగిత్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి హనుమాజీపేట గ్రామాల గౌడ సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి గ్రామంలో రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల పండుగ సందర్భంగా ఆదిశక్తి రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మునిరాజు కళ్యాణం మహోత్సవానికి ఈనెల 27వ తేదీ బుధవారం హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావుకు

### బ్రాహ్మణ పరిషత్ నిధుల గూర్చి వినతి పత్రం



హైదరాబాద్ మార్చ్ 19 (ప్రజామంటలు): బ్రాహ్మణ కార్పోరేషన్ సాధన సమితి సమన్వయకర్త, బ్రాహ్మణ సంఘాల జేఏసీ అధ్యక్షులు డా. యజ్ఞం పవన్ కుమార్ శర్మ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావును కలసి బ్రాహ్మణ పరిషత్ నిధుల గూర్చి బ్రాహ్మణ బంధువులు పడుతున్న ఆందోళనను వినతి పత్రం ద్వారా వివరించారు. వెంటనే స్పందించిన ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఫోన్ ద్వారా విషయాన్ని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బ్రాహ్మణ పరిషత్ కు రావలసిన నిధులను జమ చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపినారని అదేవిధంగా బెస్ట్ స్కీము, వివేకానంద ఓవర్సీస్ స్కీమ్ కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్లు డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ తెలియజేశారు. ఈ విషయంలో బ్రాహ్మణులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణులకు పూర్తి సహాయ సహకారాలు అందించగలరని పేర్కొన్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ సీట్ పై ఉత్కంఠ

### సస్పెన్స్ లో పెట్టిన హై కమాండ్ - అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వైపే జనం చూపు

### అభ్యర్థిత్వం ప్రకటిస్తే ప్రచారం షురూ



భీమదేవరపల్లి మార్చ్ 19 (ప్రజామంటలు): త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల పోటీలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తర్జనభజన పడుతున్నాయి. ముఖ్యంగా పోరాటాల పురిటి గడ్డ కరీంనగర్ పార్లమెంటు సీటుకు ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదు. పార్టీ అధిష్టానానికి నాలుగైదు పేర్లు పంపించినప్పటికీ, అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికే కరీంనగర్ పార్లమెంటు సీటు అని పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలు బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలో దూసుకెళ్లిపోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీని ఉత్కంఠను కొనసాగిస్తూ, ఇంకా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులలో ఆత్రుత నెలకొంది. ప్రవీణ్ రెడ్డి కి సహకార రంగంలో అనుభవం, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, దేశవ్యాప్తంగా సహకార సంఘాన్ని, మహిళ డేయిరీని విజయవంతంగా నడిపిస్తూ, వ్యవసాయ, పాడి పరిశ్రమలకు వాటి ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో తన అసెంబ్లీ సీటును పొన్నంకు వదిలి, పొన్నం గెలుపులో ముఖ్య భూమిక పోషించడం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సంఘ కార్యకలాపాల విస్తరించడం, రాష్ట్రవ్యాప్తంగా 6 గ్యారంటీలపై ప్రజలలో ఏర్పడ్డ నమ్మకం కూడా ఆయనకు కలిసొచ్చే సానుకూల అంశంగా భావిస్తున్నారు.

# కుష్టు వ్యాధి వంశపారంపర్యం కాదు

### శాపం, పాపం అంతకన్నా కాదు - ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధి పై అవగాహన

### వైద్యాధికారి డాక్టర్ రుబీనా



భీమదేవరపల్లి మార్చి 19 (ప్రజామంటలు): జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండల కేంద్రంలో వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రుబీనా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రుబీనా మాట్లాడుతూ, కుష్టు వ్యాధి లక్షణాలను తెలియజేస్తూ, చర్మంపై వర్ణ రహిత లేదా రాగి వర్ణపు, స్పర్శలేని మొద్దు బారిన మచ్చలు ఉంటే వెంటనే గ్రామ ఆరోగ్య కార్యకర్తలు సంప్రదించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాలలో కుష్టు వ్యాధికి ఉచితంగా మందలు లభిస్తాయి అని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుష్టు వ్యాధిపై ఎలాంటి అపోహలు ఉండరాదని తెలియజేశారు. ఈ వంశపార్యంపర్యం కాదని, శాపము, పాపము అంతకన్నా కాదని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేఎల్ఎన్ స్వామి, స్వరూప, శ్యామల, ఎల్. స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమం

### గాలి కుంటువ్యాధికి నివారణ టీకాలు



గొల్లపల్లి మార్చ్ 19 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల%శీ% రంగాధమునిపల్లిలో పశువులకి (గోజాతి, గేదెజాతి) గాలి కుంటువ్యాధికి నివారణ టీకాలు. ఈ కార్యక్రమం లో మండల పశు వైద్యధికారి డాక్టర్ రవీందర్, మాట్లాడుతూ.... గాలికుంటు వ్యాధి దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువుగా ఉంటుంది. దేశవాళి పశువుల్లో ప్రాణ నష్టం అంతగా ఉండదు. మార్చి, ఏప్రిల్ ఆగష్టు మాసాలలో ఈ వ్యాధి ఎక్కువుగా వచ్చును.

**వ్యాధి ఎలా వస్తుంది?**

ఇది పికోర్నా విరిడే కుటుంబానికి చెందిన అఫ్తోస్ వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెలు పాల ద్వార దూడలకి వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు:**

జ్వరం 103-106 డిగ్రీల ఫారెన్‌హీట్‌కి పెరుగుతుంది. పశువుల నోటిలో, చిగుళ్ళు పై పొక్కులు ఏర్పడటం వల్ల అవి మేత నీళ్ళు తీసుకోలేక నీరసించిపోతాయి. నోరు, గిట్టలు మధ్యలో బొబ్బలు ఏర్పడటం, 2-3 వారాల్లో అవి చితికి పుండ్లుగా మారటం. నోటి నుంచి చొంగ కారుతుంది. పాల ఉత్పతి తగ్గుతుంది.

**వ్యాధిని ఎలా నివారించాలి:**

వ్యాధి సోకిన వాటిని వేరు చెయ్యాలి. పశువుల పాకని క్రిమిసంహారక మందులతో, వాషింగ్ సోడాతో కడగాలి. చనిపోయిన పశువులని సున్నపు గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకి త్రాగించకూడదు. మార్చి-ఏప్రిల్ ఆగష్టు -సెప్టెంబర్ మాసాలకు ముందుగా వ్యాధినిరోధక టికా వేయించాలి. కాలిగిట్టలు మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా వేపనూనె రాయాలి పుయ్యాలి. నివారణ మందులు వాడాలి. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీందర్, మోతిన్, మదన్ మోహన్, సంధ్య, నర్సయ్య, శ్రీకాంత్, అజిత్ పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని

### జిల్లా వేగముగా అభివృద్ధి చెందాలి

### ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్





జగిత్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): శ్రీ లోకమాత పోచమ్మ దేవాలయమును సందర్శించిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ఆలయ పూజారులు ప్రభుత్వ విప్ ని పూర్ణ కుంభముతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వేద మంత్రములతో ఆశీర్వదించారు. ఈ సందర్భముగా లక్ష్మణ్ కుమార్. మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే, శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దయతో జగిత్యాల జిల్లా ప్రజలు అందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషములతో సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల జిల్లా వేగముగా అభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమములో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, రాష్ట్ర నాయకులు బండ శంకర్, వర్తక సంఘం అధ్యక్షులు కమటల శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల రాజేందర్, కౌన్సిలర్ ములస్తం లలిత మునిందర్, ఆలయ నిర్వాహకులు మల్లికార్జున్, గంగాధర్, ఐల చంద్ర ప్రకాష్, రేపల్లె హరికృష్ణ, గాజోజు రాజ గోపాల చారి, రాఘవ చారి, నాగమల్ల మనోహర్, తుమ్మనపెల్లి సుగుణాకర్, మానపురి మహేశ్, ఆలయ పూజారి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి స్వామివారి బ్రహ్మోత్సవాలకు

### దేవాదాయశాఖ కమీషనర్ కు ఆహ్వానం



జగిత్యాల జిల్లా మార్చి 19 (ప్రజామంటలు): మార్చి 20 నుండి ఏప్రిల్ 01 వరకు జరుగు ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణకాశిగా పేరుగాంచిన జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనవలసినదిగా కోరుతూ మంగళవారం రోజు హైదరాబాద్ కమీషనర్ ఛాంబర్లో నూతనంగా వచ్చిన యం. హనుమంత రావు కమీషనర్ దేవాదాయశాఖ కు ఆహ్వానంతో పాటు శేష వస్త్ర ప్రసాదం, చిత్రపటం ఉప కమీషనర్ దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఆధ్వర్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ అందజేసినారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విస్డమ్ ఉత్తమ మహిళా రైతు అవార్డు గ్రహీత ఆవుల సుమలత

హన్మకొండ మార్చి 19 (ప్రజామంటలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండ లో ఉన్న జయ కృష్ణ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో 2024 సంవత్సర ఉత్తమ మహిళా పురస్కారం 2024 విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవన్నపేట కు చెందిన మహిళా రైతు ఆవుల సుమలత కు వ్యవసాయ రంగంలో ఉత్తమ మహిళా రైతు పురస్కారంతో సన్మానించడం జరిగింది. తనను ఎంపిక చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మహిళ రైతు సుమలత విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.




## జాతీయ పక్షిని వేటాడిన వ్యక్తి అరెస్ట్

### రిమాండ్ కు తరలింపు



పెగడపల్లి మార్చ్ 19 (ప్రజామంటలు): జాతీయ పక్షిని వేటాడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం లక్ష్మీదేవి పల్లి కి చెందిన నలువాల సత్యనారాయణ అనే వ్యక్తి పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో లైసెన్స్ లేని తుపాకితో జాతీయ పక్షి నెమలిని కాల్చి చంపాడు. తన కారులో తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో ఐతుపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా కారులో నెమలి కళేబరాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. తనతో పాటు డ్రైవర్ గా వచ్చిన జవ్వాజి రాజు ను అదుపులోకి తీసుకున్నారు.

### అంతర్ జిల్లా చెక్ పోస్ట్ ను ప్రారంభించిన ఎస్సై అనిల్



ఇబ్రహీంపట్నం మార్చ్ 19 (ప్రజామంటలు): లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కోడ్ రావడంతో, ఇబ్రహీంపట్నం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గల బండ లింగాపూర్ గ్రామ శివారులో గల గండి హనుమాన్ గుడి వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్ట్ ను మంగళవారం ప్రారంభించామని ఎస్సై ఏ. అనిల్ తెలిపారు.

# రక్తహీనత కోసం మిల్లెట్లు

### పోషకాహార పద్ధతులపై అవగాహన - అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ



ఇబ్రహీంపట్నం మార్చ్ 19 (ప్రజామంటలు): రక్తహీనత కోసం మిల్లెట్లు పోషకాహార పద్ధతులపై మండల పరిధిలోని డబ్బా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత కోసం మిల్లెట్లను పోషకాహారం గిరిజన సాంప్రదాయ ప్రాంతీయ స్థానిక ఆహార పద్ధతులు పోషణ పై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు రోజూ తినే ఆహారంలో తీసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. పోష్టికాహారం, చిరుధాన్యాలు, సమతుల్య ఆహారం, ఆహారం వైవిధ్యం, పరిశుభ్రత, ఐరన్ యొక్క ప్రాముఖ్యత రక్తహీనత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాముని, రాశి, అంగన్ వాడి ఉపాధ్యాయులు సంజీవ రాణి, సుందరగిరి గంగామణి, ఆయాలు విమల, శ్యామల, ఆశా కార్యకర్తలు జ్యోతి, రజిత, గర్భిణీలు, బాలింతలు వివోఏ గౌతమి, మేరీ, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

### మాజీ భర్త పై యాసిడ్ దాడి చేసిన మాజీ భార్య



ఇబ్రహీంపట్నం మార్చ్ 19 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలంలోని ఎద్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్ 36 సంవత్సరాలు, 8 సంవత్సరాల క్రితం జగ్గాసాగర్ గ్రామం, మెట్‌పల్లి మండలానికి చెందిన మాస లక్షణ తో వివాహం జరిగింది. వీరికి ఒక పాప కలదు. వీరి పెళ్లయినప్పటి నుంచి వీరి మధ్య తరచుగా మనస్పర్ధలు రావడంతో వీరు ఇరువురు అంగీకారంతో తేదీ 11.10.2023 రోజున వీరిద్దరూ పరస్పర అంగీకారంతో కోర్టు నుండి విడాకులు తీసుకొని ఇద్దరు విడివిడిగా జీవనం కొనసాగిస్తున్నారు. అయితే నీరటి మహేష్ ఫిర్యాదరుడు మరల వివాహం చేసుకుందామని నిర్ణయించుకొని తేదీ 20.03.2024 న వివాహ ముహూర్తం ఉండగా, నిందితురాలు అయిన మాస లక్షణ తన మాజి భర్త మహేష్ కు హాని చేయాలని ఉద్దేశంతో, మంగళవారం ఉదయం మహేష్ ఇంటి కి వెళ్లి మహేష్ కోసం వేచి చూడగా, అతడు ఇంట్లో నుండి బయటకు రాగానే మాస లక్షణ తన వెంట తెచ్చుకున్న యాసిడ్ బాటిల్లతో మహేష్ పై దాడి చేయగా, మహేష్ కు వీపు మరియు ఎడమ కన్ను పై భాగంలో గాయాలు అయినాయని మరియు నీరటి మహేష్ ఫిర్యాదు మేరకు నిందితురాలు మాస లక్షణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్థున్నామని ఎస్సై ఏ. అనిల్ తెలిపినారు.

### శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు రూ. 1,01,116 విరాళం

### అందజేసిన కొడిమ్యాల వాస్తవ్యులు

కొడిమ్యాల మార్చ్ 19 (ప్రజామంటలు): కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు కొడిమ్యాల వాస్తవ్యులు ఏల్లం లక్ష్మీరాజం - లత వీరి కుమారుడు రాజ్ కుమార్, కుమార్తె రోజా తల్లిదండ్రులు: లక్ష్మి %--% కీ.శే. ఏల్లం నారాయణ కుటుంబం దేవాలయమునకు మహారాజ పోషకులుగా 1,01,116 (ఒక లక్ష వెయ్యి నూట పదహారు) రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారికి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి ఆర్థికంగా సహకరించిన దాతల కుటుంబానికి నిర్మాణ కమిటీ తరఫున, భక్తుల తరఫున, గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



## మహేశ్‌తో త్వరలోనే షూటింగ్ ప్రారంభం

### జపాన్ వెళ్లిన సందర్భంలో జక్కన్న వెల్లడి



రాజమౌళి-మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రానున్న సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఇటీవల జపాన్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి స్థానిక మీడియాతో మాట్లాడుతూ మహేశ్ బాబుతో సినిమా చేస్తున్నా. ఆయన మంచి నటుడు. చాలా అందంగా ఉంటారు. మీలో కొందరికి ఆయన గురించి తెలిసే ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలో చిత్రీకరణను ప్రారంభిస్తాం. వేగంగా నిర్మాణం పూర్తి చేసి మహేశ్‌బాబును ఇక్కడికి తీసుకురావాలని భావిస్తున్నా అని వెల్లడించారు. రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'ను దర్శకుడు రాజమౌళి తెరకెక్కించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రికార్డులు సృష్టించింది. దీనిలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజనల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా జపాన్‌లో గతేడాది విడుదలైంది. ఇటీవల అక్కడి ప్రేక్షకులతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించేందుకు రాజమౌళి జపాన్ వెళ్లారు. వారి అభిమానాన్ని ప్రశంసిస్తూ ఎక్స్‌లో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. జపాన్‌వాసులు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారు. అక్కడి ప్రజలు తమకు ఇష్టమైనవారికి 'ఆర్గామి క్రేన్స్'ను బహూకరించడం సంప్రదాయం. ఈ చిత్రాన్ని వీక్షించిన 83 ఏళ్ల వృద్ధురాలు నాకు దానిని ఆప్యాయంగా ఇచ్చారు. అందుకోసం థియేటర్ బయట ఆమె కొన్ని గంటలు ఎదురుచూశారు. వారి అభిమానానికి కృతజ్ఞతలు అని రాజమౌళి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోన్నాయి.

## సూర్య మూవీ విడుదల వాయిదా



తమిళ అగ్ర కథా నాయకుడు సూర్య, సుధా కొంగరాల కాంబినేషన్‌లో రానున్న సినిమా వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పురాణనూరు చిత్రీకరణ అధిక సమయం తీసుకుంటుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ చిత్రం మాకెంతో ప్రత్యేకం. ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం అని పేర్కొంది. 'ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. మీ కాంబినేషన్‌లో వచ్చిన 'సూరారై పోట్రు' (ఆకాశం నీ హద్దురా) మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం కూడా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. సూర్య43 వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో మలయాళ హీరో దుల్కర్ సల్మాన్, నజ్రియా, బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ కీలక పాత్రల్లో నటించనున్నారు. జీవీ ప్రకాశ్ మ్యూజిక్ డైరెక్టర్. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. గతంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. అందులో టైటిల్ 'పురాణనూరు' పేరుతో ముగుస్తుంది. ప్రస్తుతం సూర్య, శివ దర్శకత్వంలో 'కంగువా'లో నటిస్తున్నారు. దిశా పఠానీ కథానాయిక. బాబీ డేవోల్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

## శివానీ నాగరం మంచి సింగర్



అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అయిన తెలుగమ్మాయి శివాని నాగరం. సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజై మంచి విజయం దక్కించుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన శివాని తనదైన నటనతో..క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఆడియన్స్ మనసులని దోచేసింది. అయితే ఈ అమ్మడికి నటనలోనే కాదు..సింగర్ గా కూడా తన సినిమా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. లేటెస్ట్‌గా శివాని నాగరం సింగర్ గా అవతారమెత్తింది. ఆరంభం అనే సినిమాలో శివాని ఓ బ్యూటిఫుల్ లవ్ సాంగ్ పాడింది. 'అమాయకంగా హడావుడేమి లేక..తార చేరుకుందా ఇలా. అయోమయంగా తలాడించులాగ, నేల మారుతుందే ఎలా..కాలానికే కొత్త రంగు పూసే, మాయతార సొంతమేగా, హాయి సంతకాలు చేసేనా..' అంటూ మంచి లవ్ ఫీల్ తో ఓ మంచి కంపోజిషన్ తో సాగుతుందీ ఈ పాట. నిజానికి ఈ పాటకు మాత్రం శివాని నాగరం వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిందిని చెప్పొచ్చు. రీసెంట్?గా రిలీజ్ చేసిన ఈ పాట చాలా వినసొంపుగా ఉండటంతో పాటు లిరికల్ వీడియోలో శివాని నాగారం ఇచ్చిన పెర్ఫార్మన్స్ క్యూట్ గా తనవైపు తిప్పుకునేలా ఉంది. ఇక టాలీవుడ్ లో హీరోయిన్స్ గా రాణిస్తూనే..సింగర్స్ గా మారిన వాళ్ళు చాలానే ఉన్నారు. అందులో నిత్యామీనన్, శ్రుతి హాసన్, ఎన్టీఆర్, తమిళ హీరో శింబు, సిద్దార్థ్ సహా ఎంతోమంది అదిరిపోయే పాటలు పాడారు.మరి న్యూ టాలెంటెడ్ శివాని హీరోయిన్ గా..సింగర్ గా ముందు ముందు ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి. ఆరంభం సినిమా విషయానికి వస్తే..మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీ రోల్స్ ప్లే చేస్తున్న మూవీ ఆరంభం. ఈ సినిమాను ఏవీటీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అభిషేక్ వీటీ నిర్మిస్తున్నారు.

## జోరు మీదున్న నటి కియారా

ఇప్పుడు బాలీవుడ్ లో అగ్ర నటీమణుల్లో స్థానం సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్న నటీమణుల్లో కియారా అద్వానీ ఒకరు. రామ్ చరణ్ పక్కన 'గేమ్ చెంజర్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. శంకర్ దర్శకుడు, దిల్ రాజు నిర్మాత. ఈ సినిమా ఒక్క తెలుగులోనే కాకుండా, మిగతా భాషల్లో కూడా విడుదలయ్యే అవకాశాలు వున్నాయి. ఈ సినిమాతో పాటు ఇంకో పెద్ద సినిమా 'వార్ 2' లో కూడా కియారా కథానాయిక. గతేడాది ఫిబ్రవరి 7 తనతో ప్రేమలో వున్న సహచర నటుడు సిద్దార్థ్ మల్హోత్రా ని వివాహం చేసుకుంది కియారా అద్వానీ. తెలుగులో 'భరత్ అనే నేను' సినిమాతో మహేష్ బాబు పక్కన ఆరంగేట్రం చేసింది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అనే ఇంకో తెలుగు సినిమాలో నటించింది, ఇందులో రామ్ చరణ్ కథానాయకుడు. కియారా కి 'భరత్ అనే నేను' పెద్ద బ్రేక్ ఇచ్చిన సినిమా. తెలుగు సినిమా విడుదల సమయంలోనే 'లస్ట్ స్టోరీస్' అనే ఒక వెబ్ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించి, అందరి దృష్టి ఆకర్షించింది. తెలుగులో పెద్ద విజయం సాధించిన 'అర్జున్ రెడ్డి' సినిమాని హిందీలో తెలుగు దర్శకుడు సందీప్ వంగా 'కబీర్ సింగ్' పేరుతో అర్జున్ కపూర్ కథానాయకుడిగా రీమేక్ చేశారు. అందులో కియారా అద్వానీ కథానాయికగా నటించింది. హిందీలో కూడా ఇది పెద్ద విజయం సాధించింది. హిందీలో తన ప్రియుడు సిద్దార్థ్ మల్హోత్రా పక్కన నటించిన యుద్ధ నేపథ్యంలో వచ్చిన సినిమా 'షేర్ షా'. ఇది నేరుగా అమెజాన్ ప్రైమ్ వీడియో లో విడుదలైంది. ఈ సినిమా అటు విమర్శకుల ప్రశంశలు, ఇటు ప్రేక్షకుల మన్ననలు పొందింది. 2021లో వచ్చిన ఈ సినిమా తరువాత కియారా సినిమాలు అంతగా బాక్స్ ఆఫీస్ దగ్గర ప్రభావం చూపలేదని చెప్పాలి. కియారా ఇప్పుడు 'గేమ్ చేంజర్' సినిమాపై చాలా అసలు పెట్టుకున్నట్టు కనపడుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఆమె చేతిలో ఈ ఒక్క తెలుగు సినిమానే వుంది. ఇది హిందీలో కూడా విడుదలవుతుంది అని అనుకుంటున్నారు. ఈ సినిమా విడుదల తరువాత ఆమె 'వార్ 2' షూటింగ్ లో పాల్గొంటారు. ఇందులో ఎన్టీఆర్, హ్రితిక్ రోషన్ లు కథానాయకులు.



## మంచు లక్ష్మి ఫాంటసీ మూవీ ఆదిపర్వం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన సోషియో ఫాంటసీ మల్టీ లింగ్వల్ ఫిలిం ఆదిపర్వం చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్, ఎ.ఐ ఎంట్టంల్గ÷న్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఐదు భాషల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కింది. సోమవారం ఐదు భాషల్లో ట్రైలర్ విడుదల చేశారు. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎన్. గిరిధర్ చేతుల మీదుగా ఆదిపర్వం తెలుగు ట్రైలర్ విడుదలైంది. జడ్చర్ల ఎమ్మెల్యే జె అనిరుధ్ రెడ్డి తమిళ ట్రైలర్, ప్రముఖ దర్శకులు నీలకంఠ కన్నడ ట్రైలర్, ప్రముఖ రియల్టర్ శిల్పా ప్రతాప్ రెడ్డి మలయాళ ట్రైలర్, చిత్ర సమర్పకులు రావుల వెంకటేశ్వర్ రావు హిందీ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, బిల్డర్ కైపా ప్రతాప్ రెడ్డి, నటీనటులు ఢిల్లీ రాజేశ్వరి, సత్య ప్రకాష్, శివ కంఠమనేని, వెంకట్ కిరణ్, జెమినీ సురేష్, ఆదిత్య ఓం, శ్రీజిత ఘోష్, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, ఆర్.డి.ఎస్ ప్రకాష్, సినిమాటోగ్రాఫర్ ఎస్.ఎస్. హరీష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఘంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అతిధులంతా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్మి మంచు మాట్లాడుతూ.. 'నాకు సంజీవ్ గారు కథ చెప్పినప్పుడు ఇంత పెద్ద సినిమా తక్కువ సమయంలో ఎలా చేస్తారని అనుకున్నా. పోస్టర్ చూస్తుంటే నేను ఇన్ని క్యారెక్టర్లు చేశానా అనిపిస్తుంది. నవ రసాలు, అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మా దర్శకుడు చాలా స్వీట్ పర్సన్. మా నిర్మాతలు కోరుకున్న దాని కంటే ఎక్కువ విజయం సాధించాలని కోరుతున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓ అభిమాని మంచు లక్ష్మికి పాదాభివందనం చేయగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు మంచు లక్ష్మిని గజమాలతో సత్కరించారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. 'మంచు లక్ష్మి గారి ద్వారా మీరు స్టార్ డైరెక్టర్ కాబోతున్నారని 'ఆదిపర్వం' పోస్టర్ చూసి చాలామంది చెప్పారని అది నాకు చాలా సంతోషంగా అనిపించిందని, అవార్డు వచ్చినంత ఆనందం వేసిందన్నారు. ఈ మూవీలో మంచు లక్ష్మి గారి విశ్వరూపం చూస్తామని.. ఆదిత్య ఓం గారిని కొత్త పాత్రలో చూస్తారన్నారు. ఎస్తర్ కీలక పాత్ర చేశారన్నారు. శ్రీజిత ఘోష్ వద్దని 99 మంది చెబితే నేను ఒక్కడినే ఆ అమ్మాయి అయితే బాగుంటుందని చెప్పా అని ఆమె 1000 శాతం న్యాయం చేసిందన్నారు. క్షేత్ర పాలకుడిగా శివ కంఠమనేని, లక్ష్మి మంచుభర్త పాత్రలో జెమిని సురేష్, థియేటర్ ఆర్టిస్ట్ వెంకట్ కిరణ్ చక్కని నటన కనబరిచారన్నారు. మొత్తంగా ఈ సినిమాలో సుమారు 400 మంది నటించారన్నారు. ఈ సినిమాకు బలం, బలగం మంచు లక్ష్మి (ఓజీనిఞఠబీ ఒజీబఠపతి) గారని, దాదాపు 7 గెటప్స్ వేసిందన్నారు. దాదాపు 50 అడుగుల ఎత్తుల్గో÷ట్స్ చేశారని, ఆవిడ లేకపోతే ఈ మూవీ లేదని. ఈ మూవీకి ఇంత ప్రాముఖ్యం వచ్చేది కాదని ఇది ఆరంభం మాత్రమే' అని అన్నారు.

## ఢిల్లీ లిక్కర్ కేసులో ట్విస్ట్

### విచారణ చేస్తున్న జడ్జి ఆకస్మిక బదిలీ

న్యూఢిల్లీ,మార్చి19(ప్రజా మంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుని విచారిస్తున్న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. నాగ్‌పాల్ స్థానంలో న్యాయమూర్తి కావేరీ బవేజా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసెస్‌లోని మరో 26 మంది న్యాయమూర్తులు కూడా బదిలీ అయ్యారు. అనూహ్యంగా జడ్జి నాగ్‌పాల్ కూడా బదిలీ కావడం గమనార్హం. మరోవైపు ఎమ్మెల్సీ కవితను ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ కలిశారు. కవితతో భేటీ అనంతరం ఈడీ కార్యాలయం నుంచి ఆయన వెళ్లిపోయారు.

## కమ్మ కార్పోరేషన్‌తోనే ఉపయోగం

నిజామాబాద్,మార్చి19(ప్రజా మంటలు): కమ్మ సామాజిక వర్గంలోని పేదలకు కమ్మ కార్పొరేషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ కమ్మ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తెలిపారు. కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కమ్మ సామాజిక వర్గానికి అండగా ఉండాలని కోరారు. కమ్మ వారు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో స్వేచ్ఛ ఉందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్బంధ పాలన కొనసాగించారని మండిపడ్డారు. కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రులు రబ్బర్ స్టాంపులుగా పని చేశారని విద్యాసాగర్ రావు ధ్వజమెత్తారు.

## వీధికుక్కల బీభత్సం

### ఒకేరోజు ఏడుగురు చిన్నారులపై దాడి

నాగర్‌కర్నూలు,మార్చి19 (ప్రజా మంటలు):



రాష్ట్రంలో వీధికుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులు, పశువులపై దాడి చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. తాజాగా నాగర్‌కర్నూలు జిల్లాలో వీధి కుక్కలు ఒక్క రోజే ఏడుగురుచిన్నారులపై దాడి చేశాయి. గాయపడిన చిన్నారులను హాస్పిటల్స్‌లో చేర్పించారు. కాగా, అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు ఎప్పుడు ఎవరిపైనా దాడి చేస్తాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకుకోవాలని కోరుతున్నారు.

## మోడీవన్నీ చిల్లర రాజకీయాలు


### గల్లీ లీడర్లాఓ వ్యవహరిస్తున్నారు

### కవితపై ఆరోపణలను ఖండించిన గొంగిడి సునీత



హైదరాబాద్,మార్చి 19 (ప్రజా మంటలు): ప్రధాని దేశ నాయకుడిగా కాకుండా గల్లీ నేతగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత గొంగిడి సునీత అన్నారు. ఎలాంటి సాక్షాధారాలు లేకుండా ఎమమెల్సీ కవితపై నింద వేయడం సరికాదని సూచించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. దేశాన్ని దోచుకున్నోళ్లకు చేయూత నిచ్చిందే మోదీ అని గొంగిడి సునీత అన్నారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడం మోదీకి అలవాటు అని విమర్శించారు. వందల ప్రాణాలను బలి తీసుకున్న మోదీకి కవితను జైలుకు పంపించడం చిన్న విషయమని అన్నారు. వ్యతిరేకించిన వారిని ఇబ్బంది పెట్టడమే మోదీ నైజమని ఆరోపించారు. బీజేపీలో చేరిన వారు పవిత్రులైపోతున్నారని అన్నారు. ప్రాంతీయ పార్టీలను కబలించే కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ వచ్చే ముందు ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. మోదీ పాలన దేశం భ్రష్టు పట్టిందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కవితపై పెట్టిన కేసు మోదీ కేసు అని గొంగిడి సునీత విమర్శించారు. మహిళలను ఉద్యమం వైపు మళ్లించింది కవితే అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవితది ప్రత్యేక స్థానమని స్పష్టం చేశారు.

## బిఆర్‌ఎస్‌కు మరో నేత రాజీనామా



హైదరాబాద్,మార్చి19(ప్రజా మంటలు): బీఆర్‌ఎస్ కు ఝలక్ ల మీద ఝలక్ లు తగులుతున్నాయి. నేతలు వరుసగా పార్టీని వీడుతున్నారు. కొందరు కాంగ్రెస్ లో చేరుతుండగా..మరికొందరు బీజేపీలో చేరుతున్నారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు బీఆర్‌ఎస్ ను వీడారు. ముఖ్యంగా పార్టీ బలంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ లోనూ షాకిస్తున్నారు నేతలు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, పలువురు కార్పొరేటర్లు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ళ ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే.. తాజాగా కార్వాన్ బీఆర్‌ఎస్ ఇన్ ఛార్జ్ ఠాగూర్ జీవన్ సింగ్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు అధినేత కేసీఆర్ కు లేఖ రాశారు. తనకు రెండు సార్లు కార్వాన్ నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చినందకు కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు.

## కెసిఆర్ లక్ష్యంగా రాజకీయ కుట్రలు

### కవిత అరెస్ట్ ఉద్దేశ్యం ఇదే కనిపిస్తోంది

### మాజీమంత్రుల విమర్శలు

హైదరాబాద్,మార్చి 19 (ప్రజా మంటలు): బ్యాంక్‌లకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వారిని వదిలి కేవలం రాజకీయ కక్షతో కెసిఆర్‌ను అణచివేయాలన్న కుట్రతోనే కవితను అరెస్ట్ చేశారని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ టార్గెట్‌గానే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు. అధికారంలో ఉన్నామని భయ భ్రాంతులకు గురిచేసి పార్టీలో చేర్చుకుంటామంటే కుదరదన్నారు. అసమానతలు, అణిచివేత ఉన్నందునే నక్సల్ బరి నుంచి తెలంగాణ ఉద్యమం వరకు పుట్టుకొచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ గడ్డపై మరో ఉద్యమం పుట్టడం ఖాయమన్నారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంది కేసీఆర్ మాత్రమే అని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విర్రవీగే మాటలు మానుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యలు చేశారు. గత సీఎం కేసిఆర్ తప్పు చేసినట్లు చెప్పడం మూర్ఖత్వమన్నారు. ఎంక్వైరీల పేరుతో గత పథకాలు ఎగ్గొడుతున్నారన్నారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ ఆపేశారని మండిపడ్డారు. ఇస్తరో ఇవ్వరో ఆ వర్గాలకు సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా సీఎం చిల్లరగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భాషపై క్రిమినల్ కేసుపెట్టి జైల్‌కు పంపాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు

## ఎస్‌ఐగా చెలామణి అవుతున్న యువతి అరెస్ట్

### పెళ్లి చూపుల సందర్భంలో బయటపడ్డ మోసం

నల్లగొండ,మార్చి19(ప్రజా మంటలు): గతేడాది కాలంగా నకిలీ ఎస్‌ఐగా చెలామణి అవుతున్న మాళవిక అనే యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువతి మాళవిక తాను శంకర్ పల్లి ఎస్‌ఐని అని అందరినీ నమ్మించింది. ఆఖరికి పెళ్లి సంబంధానికి కూడా యూనిఫామ్‌లో వెళ్లింది. అయితే పెళ్లి సంబంధం కుదుర్చుకునేందుకు అబ్బాయి తరపు వారు వివరాలు ఆరా తీశారు. ఉన్నతాధికారులను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. మాళవిక నకిలీ ఎస్‌ఐ అని గుర్తించారు. కాగా మాళవికను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మాళవిక నార్కట్ పల్లికి చెందిన యువతి అని, నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఆమె 2018లో ఆర్‌పీఎఫ్ ఎస్సై పరీక్ష రాసిందని తెలిపారు. కంటి సమస్య ఉండడంతో వైద్య పరీక్షల్లో ఆమె క్వాలిఫై కాలేదని వివరించారు. నల్గొండలో మాళవికను అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. శంకర్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్నట్లు నమ్మించిందని పేర్కొన్నారు. ఆర్‌పీఎఫ్ ఎస్సైని అని చెప్పుకున్న ఆమె యూనిఫామ్, ఐడీ కార్డులను కూడా తయారు చేసుకుందని రైల్వే పోలీసులు వివరించారు. ఉద్యోగం రాలేదని తల్లి తండ్రులు బాధ పడుతుండడంతో ఆమె ఈ పని చేసినట్లు తేలిందన్నారు. కాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్‌పీఎఫ్ యూనిఫామ్‌లో మాళవిక కొన్ని రీల్స్ కూడా చేసింది..

## ఢిల్లీ మద్యం కేసులో వందకోట్లు

### ఇడి ప్రకటనపై ఆప్ తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ,మార్చి19(ప్రజా మంటలు): దిల్లీ మద్యం విధానంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విడుదల చేసిన పత్రికా ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల ముందు తమ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. ఈ దర్యాప్తు సంస్థ భాజపా పొలిటికల్ వింగ్‌లా పనిచేస్తోందని మండిపడింది.2021-22 దిల్లీ మద్యం విధాన రూపకల్పన, అమలు ద్వారా ప్రయోజనాలు పొందడానికి భారాస ఎమ్మెల్సీ కవిత, అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా తదితరులు కుట్ర పన్నారని ఈడీ తమ ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోజనాలకు ప్రతిఫలంగా ఆ పార్టీ నేతలకు రూ.100 కోట్లు చెల్లించడంలో కవిత భాగస్వామి అయ్యారని పేర్కొంది. ఈ సందర్భంగా ఆప్ నేతలు మనీశ్ సిసోదియా, సంజయ్‌సింగ్ అరెస్టు విషయాన్ని ఇందులో ప్రస్తావించింది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. 'గతంలోనూ ఈడీ ఇలాంటి అవాస్తవ ప్రకటనలు విడుదల చేసింది. ఈ కేసులో 500లకు పైగా సోదాలు జరిపినా.. వేల మంది సాక్ష్యులను విచారించినా దర్యాప్తు సంస్థకు అక్రమంగా ఉన్నట్లు నిరూపించేలా ఒక్క రూపాయి కూడా లభించలేదు. చిన్న సాక్ష్యాన్ని కూడా రికవరీ చేయలేదు. అందుకే విసుగెత్తిపోయి ఇలాంటి ఆరోపణలు చేస్తోంది. తాజాగా విడుదల చేసిన ప్రకటనలో ఒక్క కొత్త విషయం లేదు. ఇవన్నీ చూస్తుంటే కేసులో తటస్థ దర్యాప్తు విధానాన్ని వదిలేసి.. భాజపాకు పొలిటికల్ వింగ్‌లా ఈడీ పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది. ఎన్నికల ముందు కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు' అని ఆ పార్టీ మండిపడింది.

## ప్రవీణ్ రావు వ్యవహారంలో కూపీ లాగుతున్న పోలీసులు

హైదరాబాద్,మార్చి19(ప్రజా మంటలు): గత కొన్ని రోజులుగా తెలంగాణలో ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టిస్తోంది. విచారణలో తవ్వే కొద్దీ విషయాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కీలక నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసిన ప్రణీత్ రావు.. ఇప్పటికే హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే.. ట్యాపింగ్ డివైస్ మొత్తాన్ని ప్రణీత్ రావు ధ్వంసం చేసినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. డివైస్ ని ధ్వంసం చేసి అందులో హార్డ్ డిస్క్ మొత్తాన్ని పగలగొట్టినట్లు నిర్ధారించారు. అడవిలో పడేసిన పలు డివైజ్ లను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రణీత్ రావు వెనకాల మీడియా సంస్థ యజమాని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మీడియా సంస్థ యజమాని ఇచ్చిన నెంబర్లను ప్రణీత్ రావు ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మీడియా సంస్థ యజమాని దగ్గర ఒక సర్వర్ పెట్టినట్లు అనుమానిస్తున్నారు. బిఆర్‌ఎస్ కీలక నేత ఆదేశాలతో వరంగల్, సిరిసిల్లలో సర్వర్లు ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు పోలీసులు.

# ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమయ్యాడు



ప్రస్తుతం అంతర్జాతీయ టీ 20 క్రికెట్ లో నంబర్ వన్ బ్యాటర్ అంటే ఠక్కున గుర్తుకు వచ్చే పేరు సూర్య కుమార్ యాదవ్. అతను క్రీజులో ఉంటే మైదానంలో ఫోర్లు, సిక్స్ ల వర్షమే. బంతులు వేయడానికి ఎలాంటి బౌలరైనా వణికపోతారు. అలాంటి సూర్య ఐపీఎల్ లో ఆడితే ముంబై ఇండియన్స్ కు వెయ్యి ఏనుగుల బలం. అయితే ఇప్పుడది సాధ్యమయ్యేల కనిపించడం లేదు. అవునుమీడియా నివేదికల ప్రకారం, సూర్యకుమార్ యాదవ్ తన ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమయ్యాడు. పర్యవసానంగాఅతను %ఖూా% 2024 కొన్ని మ్యాచ్‌ల నుండి తప్పుకోవడం ఖాయం. గాయం తీవ్రంగా ఉంటే మాత్రం మొత్తం సీజన్‌లోనూ ఆడలేని అవకాశం కూడా ఉంది. ఈ కారణంగానే సూర్య తన సోషల్ మీడియాలో ఖాతాలో హార్ట్ బ్రేకింగ్ ఎమోజీని షేర్ చేశాడని తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ ఇటీవల స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడ్డాడు, దాని కారణంగా అతను శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ శస్త్రచికిత్స తర్వాత, అతను కోలుకునే దశలో ఉన్నాడు. అయితే ఇప్పుడు అతనికి ఐపీఎల్ 2024లోనే ఆడటం కష్టంగా మారింది. క్రిక్‌బజ్ నివేదికల ప్రకారం, సూర్యకుమార్ యాదవ్ మంగళవారం ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమయ్యాడు. ఈ ఫిట్‌నెస్ టెస్టులో విఫలమవడంతో జాతీయ క్రికెట్ అకాడమీ అతడిని ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతించలేదు. ఇప్పుడు ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడానికి సూర్యకుమార్ యాదవ్‌కు చివరి అవకాశం ఇవ్వనున్నట్లు వచ్చాయి. సూర్యకుమార్ యాదవ్ తదుపరి ఫిట్‌నెస్ పరీక్ష మార్చి 21న జరగనుంది. అంటే, ముంబై ఇండియన్స్ ప్రారంభ మ్యాచ్‌లలో సూర్యకుమార్ యాదవ్ ఆడటం దాదాపు అసాధ్యం. ఎందుకంటే సూర్య తదుపరి టెస్టులో పాసైనా, ముంబై ఇండియన్స్ అతన్ని వెంటనే మ్యాచ్‌లో బరిలోకి దించదు. సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం ప్రపంచ నంబర్ 1 టీ20 బ్యాటర్. అంతర్జాతీయ టీ20లో తన బ్యాట్‌తో 4 సెంచరీలు సాధించాడు. అతని సగటు 45 కంటే ఎక్కువ మరియు అతని స్ట్రైక్ రేట్ 170కి మించి ఉంది. %ఖూా%లో కూడా ముంబై ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు వెన్నెముకగా ఉన్నాడు. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్ %ఖూా% 2024 నుండి తప్పుకుంటే మాత్రం ముంబై ఇండియన్స్ కు భారీ ఎదురు దెబ్బ తగిలిందనే చెప్పుకోవచ్చు. సూర్య స్థానంలో రీప్లేస్ మెంట్ గా ముంబై ఇండియన్స్ పంజాబ్‌కు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్ నెహాల్ వధేరా కేరళ బ్యాటర్ విష్ణు వినోద్ లను జట్టులోకి తీసుకుంది.

## డ్రెస్సింగ్ రూమ్‌లో అడ్డంగా దొరికిన పాక్ క్రికెటర్



ఆట కంటే ఇతరేతర విషయాల్లోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు పాక్ క్రికెటర్లు. ముఖ్యంగా వారి ప్రవర్తన అక్కడి అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. తాజాగా అలాంటిదే మరొక సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మార్చి 18 (సోమవారం) కరాచీ వేదికగా పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. టైటిల్ కోసం ముల్తాన్ సుల్తాన్స్, ఇస్లామాబాద్ యునైటెడ్ జట్లు పోటీ పడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్ బౌలర్ ఇమాద్ వసీమ్ 5 వికెట్లు పడగొట్టి ముల్తాన్ సుల్తాన్ జట్టు బ్యాటర్లకు చెమటలు పట్టించాడు. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ. ఆ తర్వాతే వసీమ్ ప్రవర్తించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే అతను మ్యాచ్ మధ్యలో స్మోకింగ్ చేశాడు. అది కూడా తోటి క్రికెటర్లు ఉండే డ్రెస్సింగ్ రూమ్ లో. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. క్రికెటర్లు స్మోకింగ్ చేయడం కొత్తేమీ కాదు కానీ పీఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్ ఆడుతుండగా డ్రెస్సింగ్ రూమ్‌లో స్మోకింగ్ చేయడం అందరినీ షాక్ కు గురిచేసింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇమాద్ వసీమ్ నోటి నుంచి పొగ ఊదుతున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇమాద్ సిగరెట్లతో డ్రెస్సింగ్ రూమ్‌కి ఎలా చేరుకున్నాడనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో ధూమపానం అనుమతిస్తున్నారా? అని మరొక అభిమాని అడిగాడు. ఆట కంటే ఏదీ ఎక్కువ కాదని ఈ విషయంలో %ూూా,ౌాజదీ% కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తన ప్రవర్తనతో నెగెటివిటీ మూట గట్టుకున్న ఇమాద్ మైదానంలో మాత్రం రెచ్చిపోయాడు. తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. మొదట 5 వికెట్లు తీసిన ఇమాద్.. ఆ తర్వాత బ్యాటింగ్ లోనూ రాణించి 17 బంతుల్లో 19 పరుగులు చేసి తమ జట్టును ఛాంపియన్ గా నిలిపాడు. మరి ఇమాద్ స్మోకింగ్ వ్యవహారంపై పీసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# కట్ షాట్స్ సేమ్ టూ సేమ్ రాహుల్ ద్రవిడ్ ఆడినట్లే..



క్రికెట్ లో రాహుల్ ద్రవిడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పటి మాజీ కెప్టెన్, ప్రస్తుత టీమిండియా ప్రధాన కోచ్. ఈయన క్రికెట్ ఆడే సమయంలో టీమిండియా వాల్ అని పిలిచేవారు. ఇకపోతే.. ద్రవిడ్ తన కోచింగ్ లో టీమిండియాను పటిష్టంగా చేశాడు. మొత్తానికి అటు క్రికెట్ లోనూ, ఇటు కోచింగ్ లోనూ బాగా రాణిస్తున్నాడు. మరోవైపు.. రాహుల్ ద్రవిడ్ కొడుకు కూడా ఓ క్రికెటర్ అన్న విషయం అందరికీ తెలియదు. అంతేకాకుండా.. అతను ఆడే కట్ షాట్స్ సేమ్ టూ సేమ్ రాహుల్ ద్రవిడ్ ఆడినట్లే ఉంది. అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అతను ఆడే షాట్లను చూస్తే ద్రవిడ్ ఆడినట్లే ఉంది. రాహుల్ ద్రవిడ్ కట్ షాట్లకు ప్రసిద్ధి అని అందరికీ తెలిసిందే. ద్రవిడ్ కొడుకు సమిత్ పటేల్ కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ తరపున ఆడుతున్నాడు. లాంక్షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ జట్టు మధ్య మ్యాచ్ జరుగుతున్న క్రమంలో.. సమిత్ పటేల్ 45 బంతుల్లో 25 పరుగులు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో రెండు ఫోర్లు ఉన్నాయి. అందులో అతను ఆడిన విధానం.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. రాహుల్ ద్రవిడ్ తన కొడుకు సమిత్‌కి కోచింగ్ ఇవ్వడు. ఈ విషయాన్ని ద్రవిడ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'నా కొడుకు సమిత్‌కి నేను కోచింగ్ ఇవ్వను. నా అభిప్రాయం ప్రకారం, తల్లిదండ్రులు మరియు కోచ్ పాత్రలను ఒకేసారి పోషించడం చాలా కష్టం. కానీ.. నేను అతని తండ్రి అయినందుకు సంతోషంగా ఉన్నాను, కానీ తండ్రిగా నేను ఏమి చేస్తున్నానో నాకు తెలియదు'. అని ద్రవిడ్ తెలిపారు భారత క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌గా రాహుల్ ద్రవిడ్ తనదైన ముద్ర వేశారు. అయితే అతని కొడుకు సమిత్ ఆల్ రౌండర్. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు ఫాస్ట్ బౌలర్ కూడా. సమిత్ మాత్రమే కాదు.. సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ కూడా భారత క్రికెట్‌లో అడుగుపెట్టి తనదైన ముద్ర వేస్తున్నాడు. గతేడాది అర్జున్ టెండూల్కర్ ముంబై తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఈ సీజన్‌లో కూడా అర్జున్ ముంబై తరపున ఆడుతున్నాడు.



# నువ్వానేనా అంటోన్న దిగ్గజాలు

పార్టీ అప్పుడే మొదలైంది. మ్యాచ్ జరిగే రోజుకు ముందే సందడి మొదలైంది. రోహిత్ శర్మ వర్సెస్ విరాట్ కోహ్లీ పోటీ ఎలా ఉంటుందో చూసేందుకు ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. బెంగళూరు, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగడం గురించే కాదు.. ఐపీఎల్ 2024లో రోహిత్ శర్మ %జం% విరాట్ కోహ్లీ మధ్య మ్యాచ్ కొనసాగుతుందన్నమాట. అందుకే ఐపీఎల్ 2024 పోరు ఒకవైపు, రోహిత్-విరాట్ మధ్య కనిపించే వివాదం మరోవైపు అని చెబుతున్నాం. బెంగళూరు, ముంబై ఇండియన్స్ ఒకదానితో ఒకటి తలపడకుండా, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల మధ్య పోరు ఎలా సాధ్యం? అనే ప్రశ్నలు మీకొస్తున్నాయా.. అసలు మ్యాటర్‌కి వచ్చేస్తున్నాం.. మొత్తం టోర్నీలో వీరి మధ్య కనిపించే పరుగుల రేసు కారణంగా ఇది సాధ్యమవుతుంది. ఐపీఎల్‌లో ఓవరాల్ స్కోర్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీ చాలా ముందున్నాడు. ఇక్కడ వీరిద్దరి మధ్య 1000 పరుగుల గ్యాప్ ఉంది. కాబట్టి, ఈ విషయంలో ఎలాంటి పోటీలేదు. అయితే ఐపీఎల్‌లో ఓపెనర్‌గా సాధించిన పరుగుల పరంగా వీరి మధ్య పోటీ ఉండవచ్చు. ఐపీఎల్ 2018 నుంచి ఇప్పటి వరకు ఉన్న గ్రాఫ్‌ను పరిశీలిస్తే, రోహిత్ శర్మ, ముంబై ఇండియన్స్ కోసం ఓపెనింగ్ చేస్తున్నప్పుడు, 71 ఇన్నింగ్స్‌లలో 1744 పరుగులు చేశాడు. ఈ కాలంలో అతని స్ట్రైక్ రేట్ 127.1, సగటు 24.91లుగా నిలిచింది. ఇది కాకుండా, రోహిత్ 75 సిక్సర్లు కొట్టి 8 ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు నమోదు చేశాడు. ఐపీఎల్ 2018 నుంచి బెంగళూరు కోసం ఓపెనింగ్ చేస్తున్నప్పుడు విరాట్ కోహ్లీ 55 ఇన్నింగ్స్‌లు ఆడాడు. అందులో అతను 1861 పరుగులు చేశాడు. విరాట్ స్ట్రైక్ రేట్ 131.9గా ఉంది. కాగా సగటు 37.22 మాత్రమే. ఈ సమయంలో విరాట్ 50 సిక్సర్లు కొట్టాడు. అయితే అతని బ్యాట్ నుంచి 14 అర్ధ సెంచరీలు, 3 సెంచరీలు వచ్చాయి. ఐపీఎల్‌లో ఓపెనింగ్ రేసు విరాట్ కోహ్లీ పేరు మీదనే ఉందనేది స్పష్టం. పరుగులు, భారీ స్కోర్ల పరంగానే కాకుండా స్ట్రైక్ రేట్, యావరేజ్ పరంగానూ విరాట్ కాస్త ముందున్నాడు. ఐపీఎల్ 2024లో రోహిత్‌కి కెప్టెన్సీ బాధ్యత ఉండదు. అందువల్ల, ఓపెనర్‌గా ఆడుతున్నప్పుడు, అతను తన స్ట్రైక్ రేట్, సగటు, పరుగుల గణాంకాలను మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాడు. దీని కోసం, అతను ప్రాక్టీస్ కూడా ప్రారంభించాడు. ప్రాక్టీస్‌లో తనకు ఇష్టమైన షాట్లను ఆడుతూ కనిపించాడు. విరాట్ కూడా ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. మరికొందరు క్రికెట్ పండితులు చెప్పినట్లుగా, విరాట్ విరామం నుంచి తిరిగి వచ్చినప్పుడల్లా భారీ స్కోర్లు నమోదు చేస్తుంటాడు. ఇటువంటి పరిస్థితిలో %ఖూా% 2024లో కనిపించబోయే రోహిత్, విరాట్ మధ్య ఈ యుద్ధంలో ప్రేక్షకులకు చాలా వినోదం, థ్రిల్ ఉండబోతోందన్నమాట.

# కొత్త కెప్టెన్ రాకతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదృష్టం మారేనా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. ఆ జట్టు కేవలం 4 విజయాలు, 10 ఓటములతో అట్టడుగున ఉంది. కానీ ఈసారి జట్టు భిన్నంగా కనిపిస్తోంది. పాట్ కమిన్స్ రూపంలో జట్టు కొత్త కెప్టెన్‌ని నియమించింది. పాట్ కమిన్స్ ఆస్ట్రేలియా వన్డే ప్రపంచకప్ 2023 గెలుచుకున్నాడు. అదే సమయంలో, హైదరాబాద్ జట్టు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2021-23 ఫైనల్‌కు చెందిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ని కూడా తన జట్టులో చేర్చుకుంది. ట్రావిస్ హెడ్ జట్టులో చేరినా.. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టు ట్రోఫీని చేజిక్కించుకోగలదా అన్నది ఇప్పుడు అతిపెద్ద ప్రశ్నగా మారింది. పాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్చి 23న కోల్‌కతాలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో తమ ప్రచారాన్ని ప్రారంభించనుంది. దీని తర్వాత మార్చి 27న ముంబై ఇండియన్స్ తో తలపడేందుకు జట్టు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. దీని తర్వాత మార్చి 31న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్ తో మ్యాచ్ ఉంటుంది. వారి నాలుగో, చివరి మ్యాచ్ ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో సిఎస్కే తో జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఎంత బలం ఉందో తెలుసుకుందాం. జట్టులో మొత్తం 25 మంది ఆటగాళ్లు ఉన్నారు, ఇందులో 8 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. సన్వీర్ సింగ్, ఉపేంద్ర సింగ్ యాదవ్, అబ్దుల్ సమద్, మయాంక్ అగర్వాల్, ఉమ్రాన్ మాలిక్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ, భువనేశ్వర్ కుమార్, ఐడెన్ మర్క్రామ్, మార్కో యాన్సన్, గ్లెన్ ఫిలిప్స్, ఫజల్హాక్ ఫరూకి, హెన్రిచ్ క్లాసెన్, మయాంక్ మార్కండే, టి. నటరాజన్, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, జయదేవ్ ఉనద్కత్, ట్రావిస్ హెడ్, వనిందు హసరంగా, ఆకాష్ సింగ్, జె సుబ్రమణ్యం.ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, హెన్రిచ్ క్లాసెన్ (%ఔఖ%), అబ్దుల్ సమద్, వాషింగ్టన్ సుందర్/ షాబాజ్ అహ్మద్, పాట్ కమిన్స్ (కెప్టెన్), వనిందు హసరంగా, భువనేశ్వర్ కుమార్, ఉమ్రాన్ మాలిక్, మయాంక్ మార్కండే

ఇంపాక్ట్ ప్లేయర్స్:

టి.నటరాజన్, గ్లెన్ ఫిలిప్స్, మయాంక్ అగర్వాల్, మార్క్రమ్

30 ఏళ్ల కమిన్స్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన రెండో ఆటగాడిగా నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ అతడిని తమ జట్టులోకి తీసుకుంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ వేలంలో హైదరాబాద్ కమిన్స్‌ను రూ.20.50 కోట్లకు కొనుగోలు చేసింది.ట్రావిస్ హెడ్ %--% రూ. 6.80 కోట్లు

వనిందు హసరంగా %--% రూ. 1.5 కోట్లు

పాట్ కమిన్స్ %--% రూ. 20.50 కోట్లు

జయదేవ్ ఉనద్కత్ %--% రూ. 1.60 కోట్లు

ఆకాష్ సింగ్ %--% రూ. 20 లక్షలు

జాతవేద్ సుబ్రమణియన్ %--% రూ. 20 లక్షలుఎంత డబ్బు ఉంది, అందుబాటులో ఉన్న స్లాట్‌లు?

జట్టు వద్ద మిగిలిన డబ్బు- రూ. 3.2 కోట్లు

ఎన్ని స్లాట్లు ఖాళీగా ఉన్నాయంటే %-- 0

# అథ్లెట్లకు అందుబాటులో 3 లక్షల కండోమ్స్

## కండోమ్స్ పై బ్యాన్ ఎత్తివేత



పారిస్ ఒలింపిక్స్ సమయం దగ్గర పడుతోంది. జూలై నెలలో ఒలింపిక్స్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. 2024 పారిస్ గేమ్స్ కోసం తాము 'ఇంటిమసీ బ్యాన్'(సాన్నిహిత్యంగా మెలగడం) ఎత్తేసింది. శనివారం ఒలింపిక్ విలేజ్ డైరెక్టర్ లారెంట్ మిచాడ్ మాట్లాడుతూ.. 2024 గేమ్స్ కోసం బ్యాన్‌ని ఎత్తేస్తున్నట్లు తెలిపారు. 14,250 మంది అథ్లెట్లకు 3 లక్షల కండోమ్స్ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. మహమ్మారి కారణంగా 2020 టోక్యో ఒలింపిక్స్ సమయంలో క్రీడాకారులు మధ్య శారీరక సంబంధాన్ని నిషేధించింది. సెక్స్‌తో సహా అథ్లెట్లు ఒకరితో ఒకరు శారీరక సంబంధాన్ని పరిమితం చేశారు. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ బ్యాన్ తీసుకువచ్చారు. పారిస్ ఒలింపిక్స్‌లో క్రీడాకారులున సౌకర్యవంతంగా ఉండేలా చూసుకుంటున్నామని మిచాడ్ స్కై న్యూస్‌తో చెప్పారు. ఈ ఏడాది జూలైలో జరగబోతున్న పారిస్ ఒలింపిక్స్‌కి 2.1 బిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒలింపిక్స్‌లో కండోమ్ పంపిణీ సంప్రదాయంగా కొనసాగుతోంది. 1988 సియోల్ ఒలింపిక్స్ నుంచి నిర్వాహకులు హెచ్‌ఐవీ ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించేందుకు ఇలా గర్భనిరోధక సాధనాలను అందిస్తున్నారు. 2020 ఒలింపిక్స్ సమయంలో 1.50 లక్షల కండోమ్స్ అందచేయబడ్డాయి.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొత్త జెర్సీ లీక్??



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఇదొక శుభవార్త. ఆర్సీబీ కొత్త జెర్సీ లీక్ అయింది. ఈ జెర్సీని ఆర్సీబీ రివీల్ చేయాల్సి ఉండగా.. జెర్సీ లీక్ అయిపోయింది. ఆర్సీబీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్, భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ కొత్త జెర్సీలో కనిపిస్తున్నారు. కోహ్లీ తన జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేస్తున్నాడు. మరోవైపు కోహ్లీ, సిరాజ్‌లు కొత్త జెర్సీ ధరించిన ఫొటో వైరల్ అవుతోంది. ఐపీఎల్ 2024 తొలి మ్యాచ్ చెన్నై-బెంగళూరు మధ్య మార్చి 22న జరగనుంది. ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉంటే.. ట్రోఫీని కూడా ఆర్సీబీ గెలుచుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్సీబీపై అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ఇంతలో.. ఆర్సీబీ కొత్త జెర్సీ గురించి చర్చ ప్రారంభమైంది. విరాట్ కోహ్లీ, సిరాజ్ ధరించిన జెర్సీలో సగం నీలిరంగు, సగం ఎరుపు రంగులో ఉండడం గమనించవచ్చు. ఇందులో బెంగుళూరు లోగో, ప్రకటనల కోసం అనేక కంపెనీల పేర్లు కూడా ఉన్నాయి. ఆర్‌సీబి జట్టు ఈ జెర్సీ ధరించి ఆడుతుందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించి అధికారిక సమాచారం ఇంకా రాలేదు. ఐపీఎల్ 2024 ప్రారంభ మ్యాచ్ మార్చి 22న బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు నుంచి భారీ సంఖ్యలో ప్రేక్షకులు రానున్నారు. ఒకవైపు డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కాగా, మరో వైపు తొలి ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకోవాలని కలలు కంటున్న జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఈ మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగనుంది. బెంగళూరు వెటరన్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ కూడా 2 నెలల తర్వాత తిరిగి వచ్చాడు. దీంతో తొలి మ్యాచ్‌పై అభిమానుల మదిలో ఉత్కంఠ మరింత పెరిగింది. తొలి మ్యాచ్‌లోనే తమ అభిమాన ఆటగాడు విరాట్ కోహ్లిని చూసే అవకాశం అభిమానులకు లభిస్తుంది. ఆర్‌సీబీ పురుషుల జట్టు తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను గెలుస్తుందని బెంగళూరులోని కోట్లాది మంది అభిమానులు ఆశిస్తున్నారు. ఈ సీజన్‌లో మహిళల ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు ఫైనల్లో ఢిల్లీని ఓడించి బెంగళూరు ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో మహిళల జట్టు.. ఆర్సీబీ అభిమానుల 16 ఏళ్ల కలను నిజం చేసింది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ సేన తొలి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకోవాలని ఉవిళ్లూరుతుంది.

## గుంటూరు కారంలో మంచి ఎంటర్టైన్మెంట్ ఉంటుంది

### టాలీవుడ్ హీరోపై రవిచంద్రన్ అశ్విన్ పొగడ్తల వర్షం

ఓ క్రికెటర్.. ఓ సినిమా హీరోపై పొగడ్తల జల్లు కురిపించారు. తాజాగా రిలీజైన ఆ సినిమా.. ప్రేక్షకులను ఆకట్టుకోనప్పటికీ, సినిమాలో మాత్రం హీరో యాక్షన్ చాలా మందిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆ సినిమాలో చేసిన డ్యాన్స్ వేరే లెవల్ అంటున్నారు. ఇంతకీ ఏ సినిమా అనుకుంటున్నారా.. అదేనండీ. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన గుంటూరు కారం. సంక్రాంతికి రిలీజైన ఈ సినిమా.. పెద్దగా ఆడనప్పటికీ, తొందర్లోనే ఓటీటీలోకి వచ్చేసింది. ఇకపోతే త్వరలో టీవీలో కూడా ఈ సినిమా రానుంది. అయితే.. ఈ సినిమాలో నటించిన సూపర్ స్టార్ మహేష్ బాబుపై టీమిండియా స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ పొగడ్తల వర్షం కురింపించారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న క్రికెటర్ అశ్విన్.. మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమా గురించి మాట్లాడారు. ఆ సినిమాలో మంచి ఎంటర్టైన్మెంట్ ఉంటుందని అశ్విన్ చెప్పారు. అంతేకాకుండా.. మహేష్ బాబు అద్భుతమైన డ్యాన్సర్ అని అన్నారు. కుర్చీ మడతపెట్టి సాంగ్‌కు తమిళ ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారన్నాడు. ఆ సినిమాలో హీరోయిన్ శ్రీలల తోడైందని చెప్పుకొచ్చారు. ఈ మూవీలో వచ్చే కుర్చీమడతపెట్టి సాంగ్‌కు నెట్టింట వేల సంఖ్యలో రీల్స్ చేశారని తెలిసిందే. చీరకట్టులో, మోడ్రన్ డ్రెస్సులలో అమ్మాయిలు కుర్చీమడతపెట్టి సాంగ్‌కు ఇరగదీసే ఊరమాస్ స్టెప్పులేస్తూ దుమ్ముదులిపేసిన వీడియోలు ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తున్నాయి.ఇక.. అంతకుముందు ఒకసారి హనుమ విహారి, అశ్విన్ ఇన్ స్టా గ్రామ్ లైవ్ లో తెలుగు సినిమాల గురించి చర్చించారు. 2020లో జరిగిన వీరి సంభాషణలో తెలుగులో మీకు ఎక్కువగా నచ్చిన సినిమా ఏంటని విహారి అడగగా.. మగధీర అని చెప్పుకొచ్చాడు అశ్విన్. అంతేకాకుండా.. తమ ఫ్యామిలీ ఎక్కువగా తెలుగు సినిమాలు చూస్తారని అన్నాడు. అంతేకాదు.. మహేష్ బాబు నటించిన పోకిరీ సినిమా ఇష్టం అని కూడా చెప్పాడు. తాజాగా గుంటూరు కారంలో మహేష్ బాబు డ్యాన్స్ పై మరోసారి సూపర్ స్టార్ పేరును తలుచుకున్నాడు.

## ఆఫ్ఘాన్‌తో టీ20 సిరీస్ క్యాన్సిల్ చేసుకున్న ఆసీస్

న్యూజిలాండ్ తో టెస్ట్ సిరీస్ గెలిచి ఆస్ట్రేలియా జట్టు మంచి ఊపు మీదుంది. ఆ తర్వాత.. ఆఫ్ఘనిస్తాన్ తో టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. కాగా.. మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్.. ఆగస్ట్ లో షెడ్యూల్ అయింది. అయితే.. ఆ సిరీస్ ను వాయిదా వేస్తున్నట్లు ఆస్ట్రేలియా క్రికెట్ ప్రకటించింది. అయితే ఆఫ్ఘానిస్తాన్ లో తాలిబన్ల రాజ్యం రాగానే మహిళల క్రికెట్ జట్టుపై అక్కడి ప్రభుత్వం బ్యాన్ వేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇస్లాం మత సంప్రదాయం ప్రకారం.. మహిళల శరీర అవయాలు బట్టలు వేసుకోవడం, మగాళ్ల ముందు ఆటల ఆడటం లాంటివి అక్కడ నిషేధిస్తూ తాలిబన్ ప్రభుత్వం ఉమెన్స్ క్రికెట్ జట్టును రద్దు చేసింది. దీంతో రెండేళ్ల క్రితం ఆఫ్ఘాన్ తో జరగాల్సిన వన్డే, టెస్ట్ సిరీస్ ను కూడా క్రికెట్ ఆస్ట్రేలియా రద్దు చేసింది. తాజాగా టీ20 సిరీస్ ను క్యాన్సిల్ చేసింది. ఇదిలా ఉంటే.. ఆఫ్ఘానిస్తాన్ లో మహిళలు, అమ్మాయిలు స్వేచ్ఛగా క్రీడల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని.. అందుకోసం ఆఫ్ఘాన్ క్రికెట్ బోర్డుతో చర్చలు సాగిస్తామని తెలిపింది ఆస్ట్రేలియా క్రికెట్. ఆఫ్ఘాన్ లో ఆడవాళ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.. ఈ కారణంవల్ల ఆఫ్ఘాన్ తో ద్వైపాక్షిక సిరీస్ విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. క్రికెట్ ఆస్ట్రేలియా మహిళలకు, అమ్మాయిలకు మంచి స్వేచ్ఛనిస్తుంది. క్రికెట్ లో రాణించేందుకు తమ వంత సహాయం చేస్తుంది. అటు.. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కూడా స్త్రీ, పురుషుల క్రికెట్ ను ఒకేలా చూస్తోంది. అయితే.. ఆఫ్ఘాన్ క్రికెట్ బోర్డు.. మహిళా టీమ్ పై తీసుకున్న నిర్ణయం సరైంది కాదని అంటుంది. ఆఫ్ఘాన్ లో అమ్మాయిలకు స్వేచ్ఛ, సాతంత్ర్యం ఇస్తేనే.. వారితో ద్వైపాక్షిక సిరీస్ ఆడుతామని క్రికెట్ ఆస్ట్రేలియా చెబుతుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com